
కాళోజి

నా గొడవ

విశిష్ట కవితలు



894.827 18
కాళో - - నా
65,470

కాళోజీ

నా గొడవ

విశిష్ట కవితల సంకలనం

కాళోజీ ఫౌండేషన్

వరంగల్లు / హైదరాబాదు

నా గొడవ

కాళోజీ విశ్వ కవితం సంకలనం

ముద్రణ : సెప్టెంబర్, 2004

ప్రచురణ సంఖ్య : 6

ప్రతులు : 2000

వెల : రూ. 40/-

ప్రచురణ :
కాళోజీ ఫౌండేషన్
వరంగల్లు & హైదరాబాదు

తె.సా.1%

65,470

C-17328

ప్రతులకు :

1. కాళోజీ ఫౌండేషన్
   ఫ్లాట్ నెం.268, ఎక్సైజ్ కాలనీ,
   హన్మకొండ, వరంగల్లు - 506 001

2. కాళోజీ ఫౌండేషన్
   గ్రీన్ ఛానల్, ఇం.నెం.6-3-634,
   ఖైరతాబాదు, హైదరాబాదు - 4


ముద్రణ :
అనుపమ ప్రింటర్స్
గ్రీన్ వ్యూ, 126, శాంతినగర్,
హైదరాబాద్ - 500 028
ఫోన్స్ : 23391364, 23304194



మా మాట

సెప్టెంబర్, 2001లో కాళోజీ 88వ పుట్టిన రోజును పురస్కరించుకుని 'నా గొడవ' సమగ్ర కవితా సంపుటిని వెలువరించాము. అయితే అతి ప్రాచుర్యం పొందినవీ, విశిష్టమైనవనుకోతగ్గ కొన్ని కవితల్ని అందరికీ అందుబాటు అయ్యేలా తేవాలనే ఉద్దేశ్యంతో ఈ చిన్న కవితా సంకలనాన్ని పాఠకులకందించే ప్రయత్నం. ఈసారీ.... అభిమానులు ఆదరించి, ప్రోత్సహిస్తారనే ఆశతో -

- కాళోజీ ఫౌండేషన్



ఇదీ వరుస...

ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు?	1
వ్యత్యాసాలు	2
చాదస్తం	3
ద్వైత జగత్తు	5
వ్యర్థం	7
ఏటేటా ఎందుకు నీ పాట	8
కాటేసి తీరాలె	9
కాలయాపన	10
కోకిలా!	11
ఓటిచ్చునప్పుడు	12
మాంధాతల నాటి నుండి	13
చెమ్మగిలిన కన్నులలో	14
పోటీపడి కాటులాడ...	16
ఎవరనుకొన్నారు ఇట్లైనని?	17
బ్రతుకు	18
నా గొడవ	19
నేను ప్రస్తుతాన్ని	21
కొత్త చీపురు	23
స్వాతంత్ర్యము	26
అశ్రువులు	29
ఎవరిదేమి పోతున్నది?	30
భుక్తిమార్గ కీర్తన	33
పార్టీ ప్రత్యము	35
నేను బ్రతికే వుంటాను	37
'భావుకత'	39
ప్రజాస్వామ్యమంటే	40



జాగ్రత	42
కర్తవ్యం	42
నేనూ నా అవసరాలు	43
బతకమ్మా! బ్రతుకు!	46
అద్వైతం	48
మన భూతం	49
ఓటెవరికి?	51
అంకెల గారడి	52
స్వగతం	54
తిమిరజ్యోతి	55
మళ్లీ మహాభారతం	56
గొర్రెదాటు	58
రుతువు మారుద్ది	61
తేలిక	61
ఆ కళ్ళు	62
కవిగూడ నేతగాడే	66
శ్రీశ్రీ	67
తినలేక/ తినలేక	67
ప్రశ్నలు	68
సిరాచుక్క	71
మనిషి ఎంత మంచివాడు	71
ఇంతకన్న చావు నయం	72
సురవరం ప్రతాపరెడ్డి	74
కేశన్నా!	77
వార్నిస్తే ఆర్డిస్తు	78
పొరులమా? వురుగులమా?	79
తళుకు తళుక్కను తారను...	80
అందరివాడు	83



అమ్మ...	84
శాస్త్రం పద్ధతి	85
శ్రీశ్రీ	86
చిరంజీవి దాశరథి	86
చిరంజీవి సినారె	87
కొత్వాల్ తాత	88
దేవుడు	91
సత్తుపల్లి ఓటర్లూ!	92
అన్యాయం అంతరించాలె	94
నడత నాణ్యం	97
లోకనాయక్	97
ఎవరనుకొన్నారు? ఇట్లౌనని ఎవరనుకొన్నారు?	98
నిర్వాకం	101
తెలంగాణ వేరైతే	102
నలుబదైదు సంతకాల నటుడా?	103
రావి నారాయణరెడ్డీ!	104
ప్రాంతం వాడే దోపిడి చేస్తే	108
పోదాం పదరా!!	109
వీర తెలంగాణ నాది	110
తెలుగుబాస ఎన్నితీర్లు	111
ప్రత్యేక తెలంగాణ అంటే	116
తెలంగాణ బాస	118
చెడిన తెలుగు తనం	121
కలం గారడీ కైతల వలలల్లకు	123



నా గొడవలో పడక ముందు

(మొదటి ముద్రణకు రచయిత పీఠిక)

ఆనందమో, ఆవేదనో కలిగినప్పుడు వచ్చిన భావాన్ని వెలిబుచ్చడం జరిగింది. అది యితరులకు కాకున్నా వెలిబుచ్చిన వానికి బాగా నచ్చింది. ఇతరులకు కూడా నచ్చుతే విశేషం. ఈ విశేషధర్మం కైతకే మాత్రం ఆధారం కాదు. దానికి మూలం ప్రాణం కవికి అప్పుడప్పుడు కలిగిన ఆవేదన, ఆనందం మాత్రమే.

ఎన్నో సంఘటనలు జరుగుతుంటవి మన చుట్టుపట్టు. ఒకే సంఘటన అందరినీ ప్రభావితుల చేయదు, ఒకే రీతిగ అసలే చేయదు.

ప్రసార యంత్రం ఒకటే అయినా స్వీకరించే యంత్రాలు తమ తమ శక్తితో దానిని గ్రహిస్తవి. యంత్రాలలో అన్ని విధాల సమాన శక్తిగల పరికరాలను నిర్మించవచ్చు. మానవుల నిర్మాణం అట్లా జరగలేదు. మనకు ఏదైనా "శక్తిని బట్టి సాక్షాత్కారం, భావానుగుణ్యం రూపం".

తేది. 1-1-1953.



ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు?

అవనిపై జరిగేటి అవకతవకలు జూచి
ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు?
పరుల కష్టము జూచి కరిగిపోవును గుండె
మాయ మోసము జూచి మండిపోవును ఒళ్లు
పతిత మానవుజూచి చితికి పోవును మనసు
ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు?
తప్పుదిద్దగలేను దారి జూపగ లేను
తప్పు చేసిన వాని దండింపగా లేను
కష్టపడువారలను కాపాడగా లేను
ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు?
అవకతవకతలు నేను సవరింపలేనపుడు
'పరుల కష్టాలతో పనియేమి మాక'నెడు
అన్యులను గనియైన పోయిగా మనలేను
ఎందుకో నా హృదిని ఇన్ని ఆవేదనలు

---

1. 1942 సంలో Gold Smith వ్యాసం 'City night Peace' చదవగా కలిగిన ప్రేరణతో రాసిన గేయం.



వ్యత్యాసాలు

అన్నపురాసులు ఒక చోట
ఆకలిమంటలు ఒక చోట
హంసతూలిక లొకచోట
అలసిన దేహా లొకచోట
సంపదలన్నీ యొకచోట
గంపెడు బలగం బొక చోట.
వాసన నూనియ లొకచోట
మాసిన తలలింకొక చోట
కమ్మని చకిలా లొకచోట
గట్టి దొడ లింకొక చోట
బాహ్య బంధనము లొకచోట
భావ బంధనము లొకచోట
కామిని వాంఛలు ఒకచోట
కౌగిలింత లింకొక చోట
తనువులు ఉండే దొకచోట
తలపులు ఉండే దొకచోట
కావ్యగానము లొకచోట
కావ్య పిపాసువు లొకచోట
కళా ప్రదర్శన మొకచోట
కళారాధకులు ఒకచోట
సాహితీ నిలయ మొకచోట
చదువరులంతింకొకచోట
పెత్తనమంతా ఒకచోట
సత్తువయంతింతొక చోట
అనుభవమంతా ఒకచోట
అధికారంబది యొకచోట



చాదస్తం

ప్రతీ చాదస్తం దేవుడే
ఏదో ఒక రూపంలో గోకుడే
పుట్టుకతోనే పుట్టునీపుండు
అగపడక అంతరంగాననుండు
భావానుగుణ్యం రూపం
శక్తిని బట్టి సాక్షాత్కారం
సిగము పూనిస్తుంది వుపాసన
గిట్టదు గిట్టదు మరొక వాసన
రామభక్తుడైన హనుమడు
కృష్ణుని ఆనవాలు పట్టడు
నస్యం జూస్తె యేవగింపు
జర్దా రూపంలో గిట్టును కంపు
నామరూపాలు అనంతం
ఎవనిది వానికే వసంతం
అనుభూతి వర్ణనాతీతం
"సత్యం శివం సుందరం"
ప్రతి రంగాన దీనిదే చిక్కు
గాయానికి కట్టనీదు పక్కు
హోయి, గోకినా కొద్ది హోయి
మంటను లెక్కింపని స్థాయి
వ్యసనాలు, మహాప్రతాలు
వ్యక్తిగత చాదస్తాలు
దరిదాపున చేరిన మౌఢ్యం
వ్యాపింపజేయునీ జాడ్యం
ముదాబందీ సిద్ధాంతాలు
ఈ జాడ్యానివే వ్యాపకరూపాలు



ఒక సిద్ధాంతము పూనినప్పుడు కసి
మరొక దానిని చేస్తుంది మసి
ప్రబోధ నినాదాల పొరలు
గాలాలను దాచే ఎరలు
'భ్రమరకీటక న్యాయం'
రంగు రుద్దుటకు సాయం
ఉబిలో పడిన ప్రతివాడు
ఆనందార్థి అని అంటాడు

సుజాత పత్రిక (15-10-1960)



ద్వైత జగత్తు

కుటిలమతులు దేబెమొగాలు
జగతిలో రెండే రెండు రకాలు
చతురవర్గ విలాసం కొరకు
దేబెల సర్వస్వం ముడిసరుకు
లోకమెపుడు చతురునిదే సొత్తు
లేదమాయకున కందుల పొత్తు
శాస్త్రకార్లు శాసనకర్తలు
జనులకు తాళీకట్టని భర్తలు
చేయుటకై సామాన్యుల లూటీ
చాణక్యుల మధ్యన పోటీ
బిక్కమొగపు జనసముదాయం
టక్కరి బృందానికి తృణప్రాయం
చతురులు చతురులు పోటీపడి
మూఢ సముదాయాలకు గూర్తురు రాపిడి
చతురునిదే అన్నింటా పై చేయి
అతడన్న పగలు కూడా రేయి
దండెగొట్టు తెలివే చాలు
జోకవచ్చు గింజలు తాలు
మేధావుల కార్యాచరణము
సామాన్యుల పాలిట మరణము
టక్కరిదే అన్నింటా జోరు
నూరారు ఆరొతవి నూరు
పేర్ల మార్పు కలగించును మత్తు
తరచిచూడ సామాన్యుడె తొత్తు
ప్రజాస్వామ్యం గణరాజ్యం
చతుర నాయకమ్మన్యుల భోజ్యం
తోడేలు అండనున్న మేకలు



'బ్యా' అన్న ఊడిపోవు పీకలు
తోడేలును చంపి చిరుతపులి
మేకల మ్రింగి తీర్చుకొనునాకలి.
పాలితులపై జరిగే శోషణ
పాలకవర్గం చేసే పోషణ
జనులకు సహింపరాని అన్యాయం
శాంతి భద్రతల కాపాడే న్యాయం
మంచి తలపెట్టిన కొందరమాయకులు
త్రాగిరి విషం కొట్టించుకొనిరి మేకులు
చెంపపై కొట్టజూచి రెండవ చెంప
కొట్టుమన్న క్రైస్తు నెత్తిన కంప
సత్యాహింసల యేబదేండ్ల కృషి
క్షణంలో అయిపోయెను మసి
బ్రతికినపుడు లేదు తోడునీడ
చచ్చిన అనుపించెను పోయే పీడ
కలిగిన సంతోషాన్ని కప్పిపుచ్చి
మొసళ్ళ కన్నీళ్ల వెళ్లబుచ్చి
సానుభూతి సంతాపక సభల
శాంతింపజేస్తున్నారమాయకుల
వహ్వారే కుట్ర, చలాకీ
అందించిరి గోడ్సేకు తుపాకీ
అతడు అజాతశత్రువు యేకాకీ



వ్యర్థం

టక్కరితనమెప్పుడుండదు పొంగక?
చిక్కమొగా లెప్పుడుండవు లొంగక?
అనాదిగా రుజువగుచుండ నీ మాట
ఎందులకో కవి వ్రాయుట ఈ పాట?
బలం తోడుగా లేని న్యాయం
కవి కనిపెట్టిన గొప్ప ఉపాయం
*'ఊరడి' పోసిన వందిపిల్ల అరుపు
పూజారికి చేయగలదా చెరుపు?
గంటములెన్నియో అరిగెను
కంటకము లేమాత్రము తరిగెను?
మిన్నుముట్ట మున్ను చెట్టిన కేకలు
వక్రతలకు వేయజాలెనా బ్రేకులు?
ఎలుగెత్తి పాడిన కంఠాలు
ఏపాటి తీర్చే లోకుల తంటాలు?
ఇకపై చెల్లమని శ్రీశ్రీ అనినంత
మోసం, దౌర్జన్యం తగ్గినదెంత?
'ఇంకానా! ఇకపై చెల్లవు'
ఏమైనది ఎందుకు చెల్లవు?
'కవులకసలు లేదు బుద్ధి'
అన్నవాడు మహాసుబుద్ధి
వ్యవహారజ్ఞాన శూన్యులు
అలౌకిక శిఖామణులు
ఆకాశహర్మ్య నిర్మాతలు
గగన కుసుమ అఘ్రాతలు

1951 నంలో 'Justice without power is Impotency, Power without Justice is tyrany' అన్న ఇంగ్లీష్ సామెతను దృష్టిలో పెట్టుకొని రాసిన గేయం

* ఊరడి = బలి ఇచ్చుట.



ఏటేటా ఎందుకు నీ పాట

ఏడు మారినా ఈడు ముదిరినా
ఏమి మారినది యీ లోకంలో?
రాయి రువ్వినా రాకెట్ విసరినా
గిట్టని వానిని కొట్టుటకే కద!
కాలనడచినా కారుయెక్కినా
కోరిన చోటకి చేరుటకే కద!
పోయి చెప్పినా, ఫోను చేసినా
తలచినదేదో తెలుపుటకే కద!
*గేగు కొరికినా కేకు నమిలినా
ఆకలిమంటను ఆర్పుటకే కద!
కేకపెట్టినా కేబులిచ్చినా
ఆపదాపదని అరుచుటకే కద!
కన్ను గీటినా కమ్మ వ్రాసినా
కాముకవృత్తిని కదపుటకే కద!
ఆకు కట్టినా కోక చుట్టినా
తోచిన కాడికి దాచుటకే కద!
హారతిచ్చినా అడ్రెసిచ్చినా
పొగడి మన్ననల పొందుటకే కద!

1960లో

* *గేగు = తాటి లేతమొక్క. కోస్తాంధ్రలో తేగ*



కాటేసి తీరాలె

మన కొంపలార్చిన మన స్త్రీల చెరచిన
మన పిల్లలను చంపి మనల బంధించిన
మానవాధములను మండలాధీశులను
మరిచి పోకుండగ గురుతుంచుకోవాలె
కసి ఆరిపోకుండ బుసకొట్టుచుండాలె
కాలంబు రాగానే కాటేసి తీరాలె.
'సత్యమ్మహింస'యని సంకోచ పడరాదు
'దయయు ధర్మం' బనుచు తడుముకో పనిలేదు
'శాంతి'యని చాటినను శాంతింపగా రాదు
'క్షమ'యని వేడినను క్షమియింపగారాదు
'చాణక్య నీతి' నాచరణలో పెట్టాలె
కాలంబు రాగానె కాటేసి తీరాలె.
తిట్టిన నాల్కలను చేపట్టి కొయ్యాలె
కొంగులాగిన వ్రేళ్ల కొలిమిలో పెట్టాలె
కన్ను గీటిన కళ్ల కారాలు చల్లాలె
తన్నిన కాళ్లను 'చాకలి'గ వాడాలె
కండ కండగ కోసి కాకులకు వెయ్యాలె
కాలంబు రాగానే కాటేసి తీరాలె.

1948 నంలో గుల్బర్గా జైళ్లో ఉన్నపుడు రజాకార్లు జనగాం తాలూకాలోని బ్రాహ్మనపల్లి గ్రామ ప్రజలపై మూకుమ్మడిగా జరిపిన అత్యాచారాల వార్తలను చదివి ఆవేదన చెంది రాసిన గేయం.



కాలయాపన

కూలిపోయిన కోటగోడలను జూసి
శిథిలమైన గుళ్ళ శిల్పముల జూపి
పగిలిపోయిన దైవ ప్రతిమలను జూసి
చినిగిపోయిన పాత చిత్రముల జూపి
మాసిపోయిన రాజశాసనము జూసి
వురుగుపుట్టిన తాటి పొత్తముల జూపి
తుప్పుపట్టిన కత్తి తునకలను జూపి
పూర్వగాధలు చెప్పి పొంగేటి నీకు
ప్రస్తుతావస్థ యేపగిది నున్నదియో
ఎట్లు కన్పట్టు నీకేమి చెప్పుదును?
ప్రస్తుతపు దీనతను పాటించకుండ
ఉన్నతిని పొందుటకు ఉబలాటపడక
అన్యాయమైనను అలజడియే లేక
దౌర్జన్యములకోర్చి దాస్యజీవనము
గడుపు నీకలనాటి గాధలేటికిరా?
ఆత్మవిశ్వాసము ఆత్మగౌరవము
ఏనాడో కోల్పోతిమీనాడు మనము
భావదాస్యముచేత బంధాల చేత
పిన్నలము పెద్దలము పిరికిపందలమై
స్వార్థాలు సాధింప సందేహపడక
ఏమేమి చేయుదుమో ఎట్లు చెప్పుదును?

వరంగల్లులో 1944 సంగరంలో అంధ్రసారస్వత పరిషత్తు ప్రథమ వార్షికోత్సవం సభల సందర్భంగా ఎన్నాలు తనిన కవి సమ్మేళనంలో చదివిన గేయం. రజాకార్లు సారస్వత పరిషత్తు ప్రథమ వార్షికోత్సవ సభలను భగ్నం చేయదలచి సమావేశాల రెండోరోజున వరంగల్లు కోటలోని ఎన్నాళ్ల సన్నిధిని ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఖమ్మంపాలెంలో కవి సమ్మేళనం ఎన్నాలుకు పురాపస్తేశాల వారు అనుమతి నిరాకరించడం వల్ల కాలిబాటిన వందిళ్ళ పోటీ కవి సమ్మేళనం విజయవంతంగా జరిగింది. ఈ కవి సమ్మేళనానికి ముసినిల్ల వట్టాల రామారావుగారు అధ్యక్షత వహించగా సురవరం ప్రతాపరెడ్డి, గార్లపాటి రామిరెడ్డిగార్లు, దాశరథి మొదలైన ప్రముఖులు కూడా అనాటి సభలకు హాజరయ్యారు. దాశరథి ఎల్లి, తరువాత మంది కవులు కావ్యగానం చేశారు. ఇది గోలకొండ పత్రికలో ప్రచురితం.



కోకిలా!

లేమావి చివురులను లెస్సగా మేసేవు
ఋతురాజు వచ్చెనని అతి సంభ్రమము తోడ
మావి కొమ్మల మీద మైమరచి పాడేవు
తిన్న తిండెవ్వారిదే కోకిలా!
పాడు పాటెవ్వారిదే కోకిలా!
పేరు ఊరూ లేని పిచ్చుకవు; దయదలచి
చేరదీసీ నిన్ను గారవము చేసినా
మావిగున్నల మాట మాటవరుసకునైన
ఎన్నడైనను తలచితే కోకిలా!
ఎప్పుడైనను పాడితే కోకిలా!
ఇంపైనా 'కూకూ'ల సొంపైన రాగాల
నిండుగా నీ గొంతు నింపినా మామిళ్ళ
మాటయే మరచి; మాలోని కొందరు చేరి
ప్రేమ పేరిట కాదటే కోకిలా!
పెత్తనము నిచ్చారహో కోకిలా!
ఆమె నాదరియుండ పోయి చేకూర్చెదవు
విడిపోయి మేమేడ్వ విరహాగ్ని పెంచెదవు
ఆమె నాదరి యుండ పోయి చేకూర్చుటకు
అన్యసాధన లేటికే కోకిలా!
అల్పబాధలవేటికే కోకిలా!
ఏనాటి సుకృతమో? ఏ విశ్వకవి చలువో?
ఈనాడు నిన్నింతదానిగా చేసినది
అంతకే నీవేడ అగలేకున్నావు?
లేకున్న నీలెక్క యెందులో కోకిలా?
లేకున్న నీవేడ నుందువో కోకిలా?

1943 సం॥లో వరంగల్లులో తొమ్మిదవ శాసన గ్రంథాలయ వార్షికోత్సవాలు జరిగాయి. ఆ సందర్భంగా జరిగిన కవి సమ్మేళనానికి రాయప్రోలు సుబ్బారావుగారు అధ్యక్షులు. నిజాం ఘాతకోద్యమం ముమ్మరంగా సాగుతున్న ఆ రోజుల్లో తెలంగాణా ప్రాంతంలో ఉంటూ ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖాధిపతిగా పనిచేస్తూ తెలంగాణా ప్రజల పోరాటంతో పాలుపంచుకోలేదనే విమర్శ రాయప్రోలుపై ఉండేది. ఈ సందర్భంగా రాయప్రోలును అరిక్షేపిస్తూ రాసిన గేయం



ఓటిచ్చునప్పుడు

ఓటిచ్చు అధికార మున్నట్టివారు
ఎన్నికల సమయమున తిన్నగా వినుడు
మద్దిబానలు కొనిన కొట్టి చూచెదము
సరుకు కొన వీధెల్ల తిరిగి చూచెదము
వరునన్ని విధముల తరచి చూచెదము
ఓటు వేయుట పిల్లలాట యెట్లగును?
సొరకాయ కోతలకు మురిసిపోతారా?
కర్ర కొరకని జీలకర్ర గొంటారా?
చెరుకు తీపని వంటచెరుకు నములుదురా?
ఉప్పుకప్పురంబులుండు నొక తీరు,
గుణముల జూచియే గుర్తింపవలయు
అభ్యర్థులై ఓటులడిగేటివారు
ఏమేమి జేసిరో ఎటువంటి వారో?
పురుషులెవ్వారు కాపురుషులెవ్వారు
గుర్తించి ఓటులను గురిపింపవలయు
ప్రాణతుల్యము ప్రజాస్వామ్యమున ఓటు
వినియోగపరచుటకు అనువైన ఘడియ
ఏతెంచె నేతెంచె నిన్నాళ్ళకైన
అనుచుంటి నీ మాట అనుభవము కొద్ది
ఓటిచ్చునప్పుడే ఉండాలె బుద్ధి
ఎన్నుకొని తలబాదుకొన్న నేమగును?
తర్వాత ఏడ్చినను తప్పదనుభవము

పోలీసు యాక్షన్ తర్వాత 1949 సంగారములో స్టేట్ కాంగ్రెసుకు జరిగిన సంస్థాగత ఎన్నికల సందర్భంగా వ్రాయబడిన గేయం.



మాంధాతల నాటి నుండి

ప్రపంచ చరిత్ర సాంతము
ప్రకటించు వొక్క విషయము
మాంధాతల నాటి నుండి
మార్పు లేదు ఈ జగాన
ధృతరాష్ట్రులు దుర్యోధనులు
కృతవర్మలు శకునులు శల్యులు
దుశ్శాసనులు జయద్రధులు
ద్రోణులు భీష్మలు కర్ణులు
పాంచాలులు కుంతులు
పాండవులు శిఖండులు
పదేపదే పుట్టుచు పెరుగుచు
పదేపదే తరుగుచు విరుగుచు
శల్యరాజు సారధ్యము
కౌరవపతి కౌగిలింత
పూతనసతి పోతపాలు
కంసుమామ గారవంబు
పైమెరుగులు లోమరుగులు
విషపున్వు వెక్కిరింత
దొంగనవ్వు దొంగేడువు
ముసుగుల్లో గుసగుసలు
ప్రపంచ చరిత్ర సాంతము
ప్రకటించునొక్క విషయము
మాంధాతల నాటి నుండి
మార్పులేదు ఈ జగాన!!!



చెమ్మగిలిన కన్నులలో

చెమ్మగిలిన కన్నులలో
కమ్మలెన్నో చదివినాను.
ఒలికిపారలేని బాధ
పలుకు జారనీని గాధ
చిలికి బయటపడెడి గుట్టు
బలిమినెటులో దాచినట్టు
చెమ్మగిలిన కన్నులలో
కమ్మలెన్నో చదివినాను.
మనసుమాట మారలేదు
ఉనికి తప్పి జారిపోదు
తనువు యిపుడు నీది కాదు
'మునుపు' తిరిగి రాదు రాదు
చెమ్మగిలిన కన్నులలో
కమ్మలెన్నో చదివినాను.
లోగా ఆడిన ఆట
సాగదనెను గట్టిమాట
సైగజేయు వీలుపడక
మూగనుడుల జాలినడక
చెమ్మగిలిన కన్నులలో
కమ్మలెన్నో చదివినాను.
నలుగురి వలె మనము కూడ
వెలితిపడుట తగదు తగదు
కలిత లేని ప్రేమ మనది
కలకాలం మనగలదు
చెమ్మగిలిన కన్నులలో
కమ్మలెన్నో చదివినాను.



చిత్రమెపుడు నీదె సొత్తు
చెత్త ఇపుడు పరుని తొత్తు
పల్లేరులు మదిని కెలక
మల్లెపూల మీది పడక
చెమ్మగిలిన కన్నులలో
కమ్మలెన్నో చదివినాను.
చేరుకొంటి పరునిపంచ
కోరిగాదు పడకు కించ
'తాళి' పేర తలుగు పడగ
'కేళి' పేర గేలి జరిగె
చెమ్మగిలిన కన్నులలో
కమ్మలెన్నో చదివినాను.
చెదరలేదు ప్రేమపటము
ప్రిదులలేదు ప్రీతిఘటము
ఎదుట ఉంతు ఎడదపలక
చదువుకొనుము చెలిమి వొలక
చెమ్మగిలిన కన్నులలో
కమ్మలెన్నో చదివినాను.

1961 సంవత్సరం.



పోటీపడి కాటులాడ...

చాపచింపు - సామ్రాజ్యం,
కోడిగుడ్డు - కోహినూరు
పాటిమన్ను - ప్లాటీనం
బస్సు సీటు - బ్రహ్మరథం
ఏదైతేం? ఏదైతేం?
పోటీపడి కాటులాడ
ఏదైతేం?
అడవి మనిషి - ఆచార్యుడు
పసిబాలుడు - పండుముసలి
చిచ్చుగాడు - లచ్చిమగడు
తొత్తుకొడుకు - పెత్తన్‌దార్
ఎవడైతేం? ఎవడైతేం?
పోటీపడి కాటులాడ
ఎవడైతేం?
తండ్రి - కొడుకు, తల్లి - బిడ్డ
అన్నదమ్ము - దక్కచెల్లె
బావమరిది - భార్యభర్త
ఇరుగు - పొరుగు ఎరుగనోరు
ఎవరైతేం? ఎవరైతేం?
పోటీపడి కాటులాడ
ఎవరైతేం?
విషడివీధి - తపోవనం
చాకిరేవు - శాసనసభ
సానికొంప - సాధుమఠం
మూత్రశాల - యాత్రాస్థలి
ఎచటైతేం? ఎచటైతేం?
పోటీపడి కాటులాడ
ఎచటైతేం?

9-1-62



ఎవరనుకొన్నారు ఇట్లొనని?

ఎవరనుకొన్నారు? ఇట్లొనని ఎవరనుకొన్నారు?
వానాకాలంలోను చేనులెండిపోతాయని
మండే వేసవిలో వలె ఎండలు కాస్తుంటాయని
ఎవరనుకొన్నారు? ఇట్లొనని ఎవరనుకొన్నారు?
సత్తా రాగనే కన్నులు నెత్తికెక్కిపోతాయని
త్యాగులు సైతం గడియలో భోగులయ్యిపోతారని
ఎవరనుకొన్నారు? ఇట్లొనని ఎవరనుకొన్నారు?
త్రివర్ణ పతాకచ్ఛాయలో త్రిశంకు స్వర్గం గలదని
అరచేతిలో స్వర్గం జూస్తూ నరకంలో పడతామని
ఎవరనుకొన్నారు? ఇట్లొనని ఎవరనుకొన్నారు?
వెర్రి తలల విజ్ఞానమె వినాశనం దెస్తుందని
అణువు చిట్లి బ్రహ్మాండమే అంతరించి పోతుందని
ఎవరనుకొన్నారు? ఇట్లొనని ఎవరనుకొన్నారు?
స్వాతంత్ర్య దినోత్సవమ్ము శ్రద్ధలేని తద్దినమని
తెల్లఖాది తెరచాటున నల్లబజారు నాటకమని
దేశోద్ధారణమంతయు వేషాలని, మోసాలని
ఎవరనుకొన్నారు? ఇట్లొనని ఎవరనుకొన్నారు?
కాంగ్రెస్ వాదులచేతనె గాంధీయిజం చస్తుందని
మన కూతల మన చేతల మార్క్సీజం వస్తుందని
ఎవరనుకొన్నారు? ఇట్లొనని ఎవరనుకొన్నారు?
కంట్రోలనగనె సరుకులు కనబడకుండౌతాయని
నిండిన గోదాముల ముందట తిండిలేక చస్తామని
ఎవరనుకొన్నారు? ఇట్లొనని ఎవరనుకొన్నారు?
చేతకు సిద్ధాంతానికి చీమ, ఏన్గు తేదాయని
వట సావిత్రీ వ్రతము వారకాంత చేస్తుందని
ఎవరనుకొన్నారు? ఇట్లొనని ఎవరనుకొన్నారు?

1953లో స్వాతంత్ర్యానంతరం స్వదేశీపాలకుల పాలనా తీరుతెన్నులను నిరసిస్తూ రాసిన గేయం



బ్రతుకు

సాగిపోవుటె బ్రతుకు
ఆగిపోవుటె చావు
సాగిపోదలచిన
ఆగరాదిచటెపుడు
ఆగిపోయిన ముందు
సాగనే లేవెపుడు
వేచియుండిన పోను
నోచుకోనే లేవు.
తొలగి తోవెవడిచ్చు
త్రోసుకొని పోవలయు.
బ్రతుకు పోరాటము
వడకు ఆరాటము.
బ్రతకదలచిన పోరు
సుతరాం తప్పదు.
చూపతలచిన తోరు
రేపనుట ఒప్పదు.

1951



నా గొడవ

నా గొడవనునది
కాళోజీ అనునది
నా గొడవనునది
వాగుడు అనుపించునది
ఎడతెగని వాగుడుది
ఎడతెగక సాగునది
అక్షరజీవన మనునది
నా గొడవనునది
కాలమునకు ప్రతికూలముగా
సతతము పోరునది పోరునది
పారావారము ముట్టెడి
వారిని సైతము ధీకొని
ఎదురీతతో పొంగి పొర్లి
ఎత్తువైపు పారునది
నా గొడవనునది
కాళోజీ అనునది
కాలమునకే కాదు మహా
కాలునకును ఏనాడును
'జీ' అనని 'కలేజా'తో
కాళోజీ అనునది
నా గొడవనునది
'నఖరాలు' లేనట్టిది
నాజూకుది కానట్టిది
నాగొడవనునది
అక్షరాల జీవనది
నానా భావన నది
నీ నా భావన లేనిది
మన భావన నది



సమ భావన నది
సమరస భావన నది
నా గొడవనునది
కాళోజీ అనునది
ఎద చించుక పారునది
ఎదలందుల చేరునది
ఎందరాగబట్టినను
ఎక్కి ఎక్కి వచ్చునది
ప్రతి ఒక్కడు ఓపలేక
లోలోపల ఏడ్చునది
కనుకొలకుల చిలుకునది
కనురెప్పల తడుపునది
ఎదద ఊరి పారునది
ఎదద చేరి ఊరునది
ఎదద చింది పొంగునది
ఎదదను చిందించునది
నా గొడవను నది
కాళోజి అనునది


అం.వ్ర. కవులను సన్మానించే కార్యక్రమంలో భాగంగా 1966లో వరంగల్లులో కాళోజీకి జరిగిన సన్మాన సందర్భంగా వ్రాసిన గేయం. ఇందులోని క్రియాశ్మక పదాల్లోని 'నది' అనే పదాలను 'నది' అనే అర్థంలో చదువుకుంటే మరింత సొగసుగా ఉంటుంది.



నేను ప్రస్తుతాన్ని

నేను ప్రస్తుతాన్ని
గతానికి శిఖరాన్ని
వర్తమానాన్ని
భావికి ఆధారాన్ని
నేను నేడనెడు దాన్ని
నిన్నటి స్వప్నాన్ని
రేపటి జ్ఞాపకాన్ని
నేను ప్రస్తుతాన్ని
ఇప్పటి క్షణాన్ని

నేను గతిని
గతించిన గతానికి పుట్టినదాన్ని
గతి పుట్టించి గతించేదాన్ని
నేను గతిని ప్రస్తుతాన్ని
నేను ఉన్నదాన్ని
బ్రతికున్నదాన్ని
గతి ఉన్నదాన్ని మతి ఉన్నదాన్ని
నేను ప్రస్తుతాన్ని
నేను కలను
నేను కలకాలాన్ని
ఉండి ఉన్న దనాన్ని
ఉన్నదాన్ని ఉండేదాన్ని
నేను ప్రస్తుతాన్ని



నిన్న నివురుకప్పిన నిప్పు కణాన్ని
నేటి రాజిన రోజుని



నిగనిగలాడే 'నెగడ్డి'
రేపును రేపే 'దగడ్డి'
మునుపు చెల్లించిన ముడుపును
ఇప్పటికి మనుగడుపును
రేపును దాల్చిన కడుపును
నేను ప్రస్తుతాన్ని వర్తమానాన్ని
గతాన్ని స్వగతంగా గలదాన్ని
భావిని స్వభావంగా గలదాన్ని
నేను జీవనాన్ని జీవనదాన్ని
భావనదాన్ని నేను నవాన్ని
నేను కవనాన్ని నేను ప్రస్తుతాన్ని
నేను అక్షరాన్ని నేను సాగేదాన్ని
నేను నా దాన్ని నేను క్షణాన్ని
క్షణంలో వచ్చినదాన్ని
క్షణాన్ని తెచ్చేదాన్ని
నేను ప్రస్తుతాన్ని

గతానికి కాలుడ్డి
కాదు బాలుడ్డి
భావి గర్భితుడ్డి
నేను ప్రస్తుతాన్ని

20-1-65లో రాసింది. ఇందులోని 'నిన్నటి స్వప్నాన్ని. రేపటి భావికాన్ని' అనే వంక్తులు ఖలీల్ జిబ్రాన్ గారి 'I am dream of yesterday and memory of tomorrow' అన్న వాక్యాలకు అనువాదాలు.



కొత్త చీపురు

కొత్త చీపురొస్తున్నది
చెత్త కేడుపొస్తున్నది
ఉండి ఉండి ఉన్నచోటు
చండాలంజేసి యిపుడు
పిక్కబలం చూపుచున్న
ఏడు నడుం విరుగదన్న
వస్తున్నది తరుముకొని
వస్తున్నది కొత్త ఏడు ॥ కొత్త చీ ॥
పాతదనం పోతున్నది
కొత్తదనం వస్తున్నది
ఇపుడున్న దినం పోతున్నది
ఇంతకు మిన్నదినం వస్తున్నది
పుట్టుకొచ్చు కొత్తచిగురు
చెట్టులోని కదలికలకు
జవచచ్చిన బ్రతుకు గడుపు
నిండుకొన్న పండుటాకు
అంత్యక్రియలు జరుపుటకని ॥ కొత్త చీ ॥
పట్టు దొరికినట్టి కొమ్మ
పట్టును ప్రాణం జేసుక
పండీ ఎండీ రాలక
దండిగాను కులుకుచున్న
రండా ఆకుల రాల్చగ ॥ కొత్త చీ ॥
పుటుక పుట్టుకొస్తున్నది
చావు చావు చస్తున్నది
నిరుటి బెరడు చిరుగు చివర
చిగురు తొంగి చూస్తున్నది



ప్రగతి వాదం వస్తున్నది
ప్రగత వాదం చస్తున్నది
ముసలితనం చస్తున్నది
ఊపిరి గొట్టం శ్వాసను
ఓపలేను అంటున్నది
ఎగబీల్చిన శ్వాసనైన
దిగజార్చను అంటున్నది
కొత్తగాలి కరుకుతట్టి
గురక పుట్టుకొస్తున్నది
ప్రగతిలోని గతిగానని
'స్వగతి పరగతి గానని'
ప్రగతవాద ప్రగల్భాల
పరువు ముసుగు తొలగించి
రిమ్మ వదిలి పోవునట్లు
దుమ్ము దులిపి వేసేందుకు ॥ కొత్త చీ ॥
పాతాట ముగిసి పోతున్నది
కొత్తాట మొదలు కానున్నది
తిరిగీ అందిన ఆకుల
తురుపు* మారిపోతున్నది
క్రొత్త ఎక్కి వస్తున్నది
పాత నక్కి చస్తున్నది
ప్రగతి తరుము కొస్తున్నది
ప్రగత మురికి చస్తున్నది
పాతకేమో ఉండి ఉండి
పట్టుతప్పి పోతున్నది
క్రొత్త కేమో సరిక్రొత్తని
పట్టుదొరికి పోతున్నది



వచ్చే నవతకు అనువుగ
మారే ఇష్టందు లేక
పైబడి వచ్చే నవతను
ఆపే జోరైన లేక
పాత పరుగు తీస్తున్నది
నవత తరుముకొస్తున్నది
ప్రకృతి బయట పడుతున్నది
వికృతి మాయమవుతున్నది
నవత నగుచు వస్తున్నది
నవిత వెంట వస్తున్నది
యువత ఈల వేస్తున్నది
కవిత భవతు అంటున్నది
కొత్త చీపురొస్తున్నది
చెత్త కేడుపొస్తున్నది

27-12-64లో రాసింది.

* తురుపు = పేకాటలో *Trump Card* అని అర్థం.



స్వాతంత్ర్యము

స్వాతంత్ర్యంబన సులుదా
స్వైర విహారంబు గాదు
స్వైర విహారుల కెపుడు
స్వాతంత్ర్యం బచ్చిరాదు
బాధ్యత ఎరుగని స్వేచ్ఛ
బానిసత్వ లక్షణము.
బాధ్యత యెరిగిన స్వేచ్ఛ
స్వాతంత్ర్యపు రక్షణము.
విచ్చలవిడి వర్తనమే
స్వేచ్ఛా స్వాతంత్ర్యంబని
భావించెడి వారెవ్వరు
బాధ్యత గల పౌరులవరు.
నీతియుక్తమైన శ్రమము
చేతకాని వారందరు
జాతి ధనము దిగమ్రింగెడి
బాతాఖానీ నేతలు.
రాజకీయములు సట్టా
బాజా'రనుకొను వారికి
చేదిక్కిన కాని కాసు
కాజేయుటె కర్తవ్యము
విత్తనాల గింజలతో
విందులారగించువారు
విత్త. పెంచి పండించెడి
విత్తవృత్తి మెచ్చలేరు
నూటికి యెనుబదియైదు
మేది కాపులుండు పుడమి
కూటికి విచ్చము నెత్తుట



లోటిగాదు సిగ్గుచేటు
ఉమ్మడి సంసారంబున
నమ్మకంబు లేనివారు
నమ్మకద్రోహము తప్పని
నమ్మరు నమ్మించుతారు
పాడికి కాడికి అందని
దూడలు, కోడెలు రైతుకు
వశముగాని పసరాలు
పశుధనము కాజాలవు
వచ్చని చేలను మేయుచు
విచ్చలవిడిగా తిరిగెడి
దొంగగొడ్డు యేరికైన
బెంగబెట్టు చేటుగూర్చు
పనిదొంగలు పరభృతులు
ప్రతి పదేండ్లకొక్కసారి
జనాభాలో చేరువారు
జాతి ధనము గాజాలరు.
విచ్చలవిడి వర్తనంబు
విశృంఖల జీవనంబు
సంఘ జీవితమునకెపుడు
సంక్షోభము సంహారము
ఆర్జించెడివారు లేక
ఆరగించు వారుండిన
అమరులరువు కుబేరాస్తి
అగలేవు అంతమొందు.
శక్తిమంతులగువారలు
శక్తి వంచనంబు లేక
శ్రమల కోర్చునాడు గాని



జాతిధనము పెంపొందదు.
తంజావూరీ రాజుల
తరహా లాలస గలిగిన
లాంఛనాల ఓహోలే
రమ్యనవ్య కవిత్వాలు.
స్వాతంత్ర్యంబున నఖుడా!
స్వైర విహారంబు గాదు
స్వైర విహారుల కెప్పుడు
స్వాతంత్ర్యంబచ్చిరాదు.

14-8-1958 శ్రీ కృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో ఆంధ్ర యువజనోత్సవాల సందర్భంగా ఏర్పాటైన కవి సమ్మేళనంలో చదివిన గేయం. 'తెలుగుదేశం' - హైదరాబాద్ (స్వాతంత్ర్య దినోత్సవ సంచిక) 15-8-58 'నవ్యసాహితి' (భావ్య సంచిక) 1959 జనవరి నవ్యసాహితీ సమితి - హైదరాబాద్ 'పరిమళాలు' వారపత్రిక - హైదరాబాదులలో ప్రచురితం.



అశ్రువులు

అశ్రువులు నన్నెపుడు ఆదుకొని వుండాలె
అశ్రువులె లేనట్టి అనువులేలా నాకు
కన్నీటి కొరకు నే
నెన్నైన వదలెదను
కన్నీరు కలదేని
ఎన్నైన వున్నట్లె
కన్నీరు పులకించు
కన్నీరు నవ్వించు
కన్నీరు బ్రదికించు
కన్నీరు కదలించు
కన్నీటి చుక్కలో కడలు లుప్పొంగు
కన్నీటిలో మునుగు కైలాసగిరులు
కన్నీటిలో తేలి కాయాలు ఆడు!

1951 సానె గురూజీ వ్రాసిన మరాఠీ కవితకు అనువాదం ఈ గేయం. సానె గురూజీ కవి, కథకుడు, వ్యాసకర్త, సోషలిస్టు పార్టీ నాయకుడు. తనను 'భారతీయ సంస్కృతి' అనే పుస్తకాన్ని జైలులో 1946లో జైలులో అనువాదం చేశాడు. ప్రస్తుతం అది అలభ్యం.



ఎవరిదేమి పోతున్నది?

ఎవరిదేమి పోతున్నది?
ఎవరికేమి వస్తున్నది?
పగబూనిన షడ్వర్గం
పరిపాలన చేస్తున్నది. ॥ ఎవరిదేమి ॥

నా చెల్లెను వెన్నాడెడు
రౌడీలకు 'సాలా'నై
రాడీ తోబుట్టువులను
వెన్నాడుదు బావనౌచు. ॥ ఎవరిదేమి ॥

నా కబళము కాజేయగ
కదలాడెడి పది చేతులు
పది నోళ్ళలొ మన్ను గొట్ట
నా చేతుల కదలికలు ॥ ఎవరిదేమి ॥

నా మేడను కూల్చ్రోయ
గునపాలెత్తిన చేతులు
మురికిపేట యజ్ఞానికి
నా చితికెలో అగ్గిపుల్ల ॥ ఎవరిదేమి ॥

నా గరిశెకు నివ్వుపెట్ట
అన్నార్తుల బడబాగ్నులు
కడుపులో చిచ్చుపెట్ట
నా ఎత్తుల 'జెకముక'లు ॥ ఎవరిదేమి ॥



సీటు నుండి నన్ను దింప
పెనుగులాడ పది తలలు
పది తలలను చితగ్గొట్ట
మురాకొండ దొరను నేను ॥ ఎవరిదేమి ॥

వక్రతుండ కామనలను
సక్రమముగ దాచగ నే
ఎరబెట్టిన ప్రాణము నా
ఎద కదలిక కానప్పుడు ॥ ఎవరిదేమి ॥

ఎరకొరకని పెర ప్రాణము
ఏరి తోరణాలు గ్రుచ్చ
'ఆపు! ఆపు! దారుణమను'ను
ఆసామే లేనప్పుడు ॥ ఎవరిదేమి ॥

'కోటి విద్యలైన తుదకు
కూటి కొరకె' అను లక్ష్యము
అనుక్షణము అందరికిని
కనుల ముందు ఉన్నప్పుడు ॥ ఎవరిదేమి ॥

గుండాగిరి దాదాగిరి
కోదండము చేతబట్టి
దగాకోరు దుండగీళ్ళు
దర్జాతో ఉన్నప్పుడు ॥ ఎవరిదేమి ॥

ఖలునే అధినేత మురా
బలునే తమ ప్రియతముగా
మెచ్చి ఎన్ని ఏరి కోరు
మ్రుచ్చులు హెచ్చయినప్పుడు ॥ ఎవరిదేమి ॥



మానమన్న వుంటే కద
హాని భయము, భంగపాటు
కష్టార్జితముంటే గద
నష్టమాయె నన్న చింత ॥ ఎవరిదేమి ॥

లూటీ సొమ్మును మన
మే రేటుకు అమ్మితేమి
దొంగ నాణెమునకు బదులు
దొరికిన దంతయు ధనమే ॥ ఎవరిదేమి ॥

ఎవరిదేమి పోతున్నది? ఎవరికేమి వస్తున్నది?
పగటూనిన షడ్వర్గం పరిపాలన చేస్తున్నది

4-4-1966



భుక్తిమార్గ కీర్తన

ప్రజాసేవన పేర బ్రతకండీ, తిన్నంగ మీరు
ప్రజల సొత్తును మీదెయనుకోండి
సులభమైన భుక్తి మార్గము
సుళువుగా పైకొచ్చు మార్గము ॥ ప్రజా ॥

ఆరితేరిన వాని జూడండి - మెల్లంగ వాని
తీరు తెన్నుల ననుకరించండి
అక్షరాలు నేర్వకుండనే
లక్షలను గడియించు మార్గము ॥ ప్రజా ॥

ఉన్న సంస్థను ఆక్రమించండీ, లేకున్న మీరో
చిన్న సంస్థను లేవదీయండి
పైరవీలకు సుగమ మార్గము
పదవులను ఇప్పించు మార్గము ॥ ప్రజా ॥

గాంధీ పేరుతో భజన చేయండి, వీలైతె తోడుగ
ఖాది వేషము దాల్చి తిరగండి
చిల్లిగవ్వ చేత లేకనె
చల్లగా బ్రతికేటి మార్గము ॥ ప్రజా ॥

నాయకుడు నెహ్రూంటు చాటండీ, చిన్నంగ మీ మీ
నాయకత్వం పాదు పెట్టండి
పరువు మర్యాదలతొ గూడిన
బ్రతుకు తెరువు వున్న మార్గము ॥ ప్రజా ॥



ఓటులను సమకూర్చి పెట్టండీ, ఆ వొక్క మాటే
లోటులన్ని తీర్చు గుట్టండి
పట్టుదలతో ఎందరో చే
పట్టి నడిచిన విజయ మార్గము ॥ ప్రజా ॥

బరుమ, పాకిస్తాన్లు వేరండీ, ఆ నాయకులకు
బాపూజీ యాతీస్సులేవండి?
నెహ్రూ నడ్డము పెట్టుకొనుచు
నిపుణులు నడిచేటి మార్గము ॥ ప్రజా ॥

L 1964 నం॥ రము



పార్టీ వ్రత్యము*

పార్టీ దేవుడు దైవము
పార్టీయే సర్వస్వము
పార్టీకిష్టము కాని
వ్రతము, పూజ పనికి రాదు
పార్టీ తప్పంటే తప్పు
పార్టీ ఒప్పంటె ఒప్పు
పార్టీ అదుపులో చేసిన
పాపము సహితము పుణ్యము
పార్టీ వలదను పుణ్యము
పాపము కన్నను హేయము
పాపపుణ్యముల చర్చ
పార్టీ వ్రతలకు తగదు
పార్టీ మినహా వేరొక
పాట, ఆట పనికి రాదు
ఆత్మ విమర్శన శక్తి
ఆలోచన అనుమానము
సోకిన పార్టీ వ్రత్యము
సున్నయగుట మరువరాదు
పార్టీ కనుసన్నలందె
పార్టీ వ్రతలకు స్వర్గము
ఎట్టి పాపఫలమైనను
ఇంచుకేని అంటనీక
కట్టుదిట్టములు చేయగ
కంకణబద్ధము "పార్టీ"



"ఖైసు" చేయు చప్పుళ్ళకు
వీపు చెదర గుండె బెదర
పార్టీవ్రత్యము సతతము
పాలించుటయే ధర్మము
ఘటమే శాశ్వతమనుకొని
మురాతత్వమున మెలగెడి
అధికారపు రాజకీ
యములందలి దీ మర్మము

9-4-60

*'పాతివ్రత్యం' అన్న మాటకు వ్యంగ్యార్థ సూచకం పార్టీవ్రత్యం



నేను బ్రతికే వుంటాను

నేను బ్రతికే వుంటాను
నా పరాయితనం పోగొట్టే ఆర్తత
చెలిమి చెలిమెలో
చిందు నన్నాళ్లు ॥నేను బ్రతికే ॥

నా ఇరుకుల చేరి దూరి
అద్దమైన మురికినంతా
తన్నేసే జీవన నది
జీవ నదిగా
ప్రవహించు చున్ననాళ్లు ॥నేను బ్రతికే ॥

ఆతతాయి వాతావరణంలో కూడా
నా షడ్వర్గం తన శీలాన్ని
కాపాడు కున్ననాళ్లు ॥నేను బ్రతికే ॥

తోడు వాద్యాల
తప్పుడు చప్పుళ్లకు
సమ శ్రుతిగా
నా గాత్రం
పెకల నన్నాళ్లు ॥నేను బ్రతికే ॥

కంచం మంచం రెండే
సర్వమ్మను వాదానికి
నా తెలివితేటలు
తలవొగ్గ
నిరాకరించినన్నాళ్లు ॥నేను బ్రతికే ॥



నా జీవనానికి
పాతాళం అడుగంట దిగజారే
చొరవ, సత్తువ, ధైర్యం
ఉవ్వెత్తున లేచి
ఆకాశావకాశాలను వ్యాపింప
ఆవిరియై పొయ్యేంతటి
తపన, తపతపా, సంసిద్ధత
సాహసం ఉన్నన్నాళ్లు ॥ నేను బ్రతికే ॥

---

1. 1966 సంగారం



'భావుకత'

గుండె కొట్టుకున్నంత సేపే బ్రతుకు
నాడి ఆడిందాకే ప్రాణం
కండ్లల్లో పదనున్నంత వరకే చూపు
జనం ఉన్నంతసేపే జగత్తు
ఇవన్నీ ఒక ఎత్తు భావుకత ఎత్తు
భావుకత లేకుంటే బండబారుతుంది బ్రతుకు
కంటిలోని తడి ఆరిపోతుంది
గుండెలు చిమ్మే రక్తంలో బలముండదు
నాడుల ఆటలలో పస ఉండదు
జనంలో జవ ఉండదు
జగత్తులో మహత్తుండదు - ఐనా
భావుకత సంజీవిని వంటిదే
ఆహారం మాత్రం కాదు
మూర్ఛిల్లిన యోధుడ్ది లేపి యుద్ధం చేయిస్తుందది
పూటపూటకు పుట్టుకొచ్చే ఆకలిని తీర్చే అన్నం కాదది
గుండె కొట్టుకొనేందుకు ఆహారం
నాడులు ఆడేందుకు ఆహారం
కండలు బలిసేందుకు ఆహారం
రెప్పలు కదిలేందుకు ఆహారం
జనం బ్రతుక్కి ఆహారం
జగత్తు గతికి ఆహారం
జగత్తుకు, జనానికి, గుండెకు, నాడికి,
కండకు, కంటికి
ఆహారం ఆదీ పునాది
భావుకత శిఖరం, పరమావధి.

1965



ప్రజాస్వామ్యమంటే

ప్రజాస్వామ్యమంటేమిటి?
ప్రజారాజ్యమంటేమిటి?
సౌజన్యాలకు రక్ష
సామరస్యాలకు రక్ష
సహకారాలకు రక్ష
సహజీవనానికి రక్ష
ప్రజాస్వామ్యమంటే అది
ప్రజారాజ్యమంటే అది!
మానవత్వానికి మనుగడ
దానవత్వానికి ఎద దడ
గుండాతనానికి దగడు
గూడుపుఠానికి బెగడు!

కుట్రదారులకు పాడలు
చక్రాలను మాడ్చుకొడలు
శాసనబద్ధ వ్యవస్థ
స్వైరవిహారునకవస్థ!

ముఠాబందికి మృత్యువు
శరపీరముల శత్రువు
ఆతతాయి సంహరణ
అనామకుని సంరక్షణ!

న్యాయవర్తనులకు హోమి
మాయముడత లేని సామి
ప్రతిభకు సరిపడు వెల
రసముల చిలికెడు జల!



నిజాయితీకి ప్రోత్సాహం
మజానీతికి మృత్యూహం
పనిదొంగల కాటకట్టు
పనిదొర కాయువు పట్టు!

సంరక్షిత పౌరమతము
స్వాతంత్ర్యమునకు పాతము
పాక్కుల కాపాడు కోట
మక్కువ వికసించు తోట!

నెయ్యము పెంచెడి మది
నీతుల నేర్పెడి బడి.
ఆర్ద్రత అరని తడి
అమ్మకడుపు దాచిన ఒడి!
ప్రజాస్వామ్యమంటే అది
ప్రజారాజ్యమంటే అది.

1963



జాగ్రత

మన కలానికి కన్నొక్కటి
కలవు నాలుకలు రెండు
పదువుకూడు మజా మెండు
గుటగుట మేసేటప్పుడు
లొటకలు వేసేటప్పుడు
ఉన్న కన్ను కూడ సున్న
జాగ్రత! జాగ్రత! జాగ్రత!!!

కర్తవ్యం

వెనుకకు చూస్తే భూతం
కనిపించును చూడకు అటు
లభ్యం కాని భవిష్యం
లక్ష్యిస్తూ రభస పడకు
వర్తమానం వ్యర్థం చేయని
కర్తవ్యం నీదని మరవకు
ప్రచార దాసులు శ్రవణకుమారులు
స్వయం వివేచన సంగతి ఎరుగరు
పశ్చాత్తప్తులు[1] పూర్వతప్తులు
ప్రస్తుత మెరుగని వ్యక్తులు వ్యర్థులు

6-2-1960

1. పశ్చాత్తప్తులు అనే పదాన్ని బట్టి పూర్వతప్తులు అనే పదం



నేనూ నా అవసరాలు

నేనూ నా అవసరాల
కట్టిన మూల్యాన్ని బట్టి
వేణువు, నాదం, వరాలు
గొట్టం ఊపిరి సరాలు
వర్తమాన పరిసరాలు
అస్తి నాస్తి యిహపరాలు ॥ నేనూ ॥
కోడిగుడ్డు-కోహినూరు
చాపచింపు - సామ్రాజ్యం
పాటిమన్ను - ప్లాటినం
బస్సుసీటు - బ్రహ్మరధం ॥ నేనూ ॥
నేను వలచినది రంభ
నేను మునిగినది గంగ
కసిబూనిట ప్రాడిధర్మ
సైరణ వశిష్ట కర్మ ॥ నేనూ ॥
విస్సన్నన్నదె వేదం
పాపపుణ్యముల భేదం
శ్రుతి స్మృతుల అమోదం
క్రీడామోదం ఖేదం ॥ నేనూ ॥
విధులు కూడ నిషేధాలు
నిషేధాలు కూడా విధులు
మధ్యే మార్గం సాకులు
వైకల్పిక జ్ఞాపకాలు ॥ నేనూ ॥
బొంకు - రాజనీతిజ్ఞత
రంకు - రతి విషయజ్ఞత
శుక్రనీతి అసరాలు
పురాణేతి హాసాలు



వసుదేవుడు గాడిదకాళ్లు
కుక్క మెక్కు గాదేయుడు
తార్కికుడు - ఛందాలుడు
కుక్కగొడుగు ఛత్రాలు
చీపుర్లే చామరాలు ॥ నేనూ ॥
ఎదుటివాని అవసరాలు
వ్యసనాలు సుఖరాలూ
చాపల్యము చాణక్యము
వేసికొన్న బురఖాలు ॥ నేనూ ॥
నేనూ నా అవసరాలు
కట్టిన మూల్యాన్ని బట్టి
వాటి వీటి మాటేమిటి
దేవుడు సైతం ఒక పరి
శూన్యుడు పూజ్యుండు అది
మధ్యాంతంబుల రహితుడు
కలడు కలడు లేడు లేడు
కలడు కలండనెడు వాడు
కలడో లేడో అనియెడి
సందియంబు కూడ కలదు ॥ నేనూ ॥
లింగమె సర్వేశ్వరుండు
మాయా మోహము విష్ణువు
రాయీ రప్పా దేవుడు
భక్తుల బంటు విధేయుడు
తలాతోక లేనివాడు
నిరాకార నిర్గుణుండు
సాకారుడు సద్గుణుండు
సర్వాంతర్యామి వాడు
ఎవ్వరికీ కానరాడు



ఎవ్వరి జోలికి పోడు
సాక్షిభూతుడు వాడు ॥ నేనూ ॥
నేనూ నా అవసరాలు
కట్టిన మూల్యాన్ని బట్టి
దేవుడు సైతం ఒక పరి
లేడంటే నొచ్చుకొనడు
ఉన్నడంటే మెచ్చుకొనడు
ప్రహ్లాదుల చితగ్గొటి
అజామీళుల బ్రోచువాడు
న్యాయాత్ముడు, ధర్మాత్ముడు
దయామయుడు కరుణాత్ముడు
నేనూ నా అవసరాలు
కట్టిన మూల్యాన్ని బట్టి

12-3-1966



బతకమ్మా! బ్రతుకు!

గుమ్మడిపూలు పూయగ బ్రతుకు
తంగెడి పసిడి చిందగ బ్రతుకు
గునుగు తురాయి కులుకగ బ్రతుకు
కట్ల నీలిమలు చిమ్మగ బ్రతుకు — బతకమ్మా! బ్రతుకు
అమ్మను మరవని సంతానము కని — బతకమ్మా! బ్రతుకు

పచ్చని పసరిక బయళ్ళ బ్రతుకు
పల్లె పట్టుల పంటల బ్రతుకు
పసుపుతోట మరియాదగ బ్రతుకు
పున్నమ వెన్నెల మాదిరి బ్రతుకు — బతకమ్మా! బ్రతుకు

మూడుముళ్ల బిగియింతల పద్దుల
జంట బ్రతుకు తాహత్తుల హద్దుల
మమతల, మమతల పెంచెడి సుద్దుల
తీరుతీరు చవులూరెడి చద్దుల — బతకమ్మా! బ్రతుకు

పసుపు కుంకుమల వసతుల తేలుచు
పారాడిలో మారాడిగ పారుచు
ఆలమంద గొంతుల 'అంబా'దుతు
దాంపత్యపు దివ్వెల వెలయించుచు — బతకమ్మా! బ్రతుకు

తండ్రుల తాతల జేయుచు మురియుచు
కొడుకుల తండ్రుల జేయుచు వెలయుచు
అమ్మల అవ్వల జేయుచు కాయుచు
బిడ్డల తల్లుల జేయుచు సాకుచు — బతకమ్మా! బ్రతుకు

నాసటి కుంకుమల తళుకుల నీనుచు
మంగళసూత్రము వలపుల పేనుచు



గాజుల గలగల నవ్వుల తేలుచు
కాలి మట్టియల వలుకుల కులుకుచు బతకమ్మా! బ్రతుకు

మక్కలరాసుల మసిడిగ బ్రతుకు
గేగుల కండల జమగా బ్రతుకు
'సీతాఫల' కమగ్రుడ్డుగ బ్రతుకు
పాలుపట్టి గింజూరగ బ్రతుకు బతకమ్మా! బ్రతుకు

నల్లపూసల నడుమని బ్రతుకు
పాలతిన్నియల దాపుని బ్రతుకు
నొసటి మధ్య మందారమ! బ్రతుకు
కాళ్ల వసుపు పారాడి! బ్రతుకు బతకమ్మా! బ్రతుకు

పాటపాడి పాటల పాడిస్తూ
ఆటలాడి ఆటల ఆడిస్తూ
జంటగూడి జంటల కూరుస్తూ
బతుకు బ్రతికి బతుకుల బ్రతికిస్తూ బతకమ్మా! బ్రతుకు

తెలిమి తెలములు తీరేదాకా
తెలిమి కలుములు నిలిచే దాకా
తెలిమి మెప్పెలలు కాసేదాకా
తెలిమి రాగములు ఒలికేదాకా బతకమ్మా! బ్రతుకు

మన్నూ మిన్నూ ఉండే దాకా
సూర్యుడు చంద్రుడు వెలిసే దాకా
చుక్కలు మింటిలో కులికే దాకా
కాల చక్రము తిరిగే దాకా బతకమ్మా! బ్రతుకు
అమ్మను మరవని సంతానము కని బతకమ్మా! బ్రతుకు

1966 బతకమ్మ వండుగ సందర్భంలో



అద్వైతం

నీకూ నాకూ వానికి
నీతుల్లో ఉన్న తేడ
కూతల్లో ఉన్న తేడ
చేతల్లో కనబడదేం?

జ్ఞానకాండ ఏదైనను
గానసరళి ఏదైనను
కర్మకాండ ఒకటేనని
కనిపించును కలయజూడ

కులదైవం బేదైనను
కొలచు తీరు వేరైనను
కలదయ్యం బొకటేనని
కనిపించును కలయజూడ

మనిషి మనిషి వేరైనను
ఉనికి స్థాయి ఏదైనను
మనసు మాత్రమొకటేనని
కనిపించును కలయజూడ

నీకూ నాకూ వానికి
నీతుల్లో ఉన్న తేడ
కూతల్లో ఉన్న తేడ
చేతల్లో కనబడదేం?

1966



మన భూతం

మా భూతము కడుగొప్పది
మా భవితవ్యము పూజ్యము
మా ప్రస్తుత మెట్లుంటేం?
మా కెవడూ సాటిరాడు
        సూర్యుని చంద్రుని చుక్కల
        ఆర్యులె కద మొట్టమొదట
        చూచుట, అనార్యులకు
        చూపించుట; ఎంత ఘనత!!
అనార్యులంత మా చదువుల
సునాయాసముగ నేర్చుక
అన్నిట పైకొచ్చినారు
అసలు వారికేమున్నది?
        మా పితరులు చంద్రలోక
        స్తూపాలై పూజలొంద
        కుర్రకుంకలకు నేటికి
        కోర్కెలు పుట్టి చూతామని
ఇంద్రలోక అప్సరసలు
ఈ భూమికి దిగివచ్చిరి
తాపసులౌ మా తాతల
దాపునకై దేవురించి
        అగుపించెడి చందురుదే
        అందుకొనెడి సౌభాగ్యము
        అబ్బని యీ జేజెమ్మల
        అబ్బకు అందున స్వర్గము



మా పురూరవుని కొరకు
మరియెవ్వడో కాదు ఋద్ధు
ఇంద్రుడె స్వయముగ పంపెను
ఎవ్వరు చూడని యానము
మా భూతము కడుగొప్పది
మా భవిష్యము పూజ్యము
మా ప్రస్తుత మెట్లుంటేం?
మాకెవడూ సాటిరాడు.


1966



ఓటెవరికి?

వటసావిత్రీ పూజల వారకాంతకా 'ఓటు'?
పార్టీ పథకాల దాబు దలారీలకా ఓటు?
సారా కూరా పోరీ
బేరాలక మన ఓటు?
నల్లబజార్ భవనాలకు
వెల్లవేయనా ఓటు?
సేటు బ్యాంకు నోటు కాయు
కూటమికా మన వోటు?
లూటీ చేయగ పర్మిటు
చీటియా మన ఓటు?
ప్రజాస్వామ్య అంత్యక్రియల
సామగ్రియు మన వోటు?
వేటకాని పని సులువుకు
మాటు మంచెయా ఓటు?
పౌరమతము సున్న జేయు
నేతాగిరికా ఓటు?

1966





అంకెల గారడి

అంకెల తోడను గారడి
ఆర్థికాలపై 'ప్యారడి'
అంకెలు అంకెలు అంకెలు
వంకల దాచెడి అంకెలు
లొటుకులు లేవను అంకెలు
చిటికెల పందిరి అంకెలు
అంకెల తోడను గారడి
ఆర్థికాలపై 'ప్యారడి'
లోటు-మిగులు అద్వైతము
రుజువుచేయు పొడి అంకెలు
అంచనాల వంచనలకు
వంచిన తలలో వంకలు
బోసినోటి నుండి పన్ను
ఆసించెడి వెర్రి అంకెలు ॥అంకెలు॥

షిర్ర చిదిమి గణపతయ్య
బొర్రను మెత్తెడి అంకెలు
లేని ఖర్చు పద్దులేసి
పూనిక చేసెడి అంకెలు
లేని సరుకు ప్రోగుచేసి
తూనిక జేసెడి అంకెలు ॥అంకెలు॥

ఆదాయము చూపుటకై
అట్టే యెదిగెడి అంకెలు
తుట్టిని చూపెట్టుటకై



అట్టే ఒదిగెడి అంకెలు
'కామరూపు'లీ అంకెలు
కాసుమాయలీ అంకెలు ॥అంకెలు॥

బహుళము బహుళ విశుద్ధము
బహుళార్థ సాధకము
బహిరంతరము లనేకము
'బ్రహ్మానందము' బడ్జెట్
'బహురూపులు' నిపుణతలో
బ్రహ్మంతటి నీ అంకెలు ॥అంకెలు॥

ప్రజకంతకు 'కనుకట్టు'
ప్రతిపక్షుల ఆటకట్టు
కాటులాటకెగపెట్టు 'కటుమోషను'[1] లకు పట్టు
'కాసు' ఆటలోని గుట్టు కాళోజీ మసిగట్టు
'ఫైనాన్సెస్'పై 'ప్యారడి'
'ఫైను' ఫైనుల గారడి

1969లో కాళోజీ ఎం.ఎల్.సి.గా ఉన్నపుడు ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి ప్రవేశపెట్టిన 'బడ్జెట్' ప్రతిపాదనపై ప్రతిస్పందిస్తూ రానిన గేయం.

1. కటుమోషన్ = చట్టసభలో ప్రవేశపెట్టే బడ్జెట్‌పై కోత తీర్మానం.



స్వగతం

అతిధివోలె వుండి వుండి
అమని విడిచి వెళ్ళుతాను
పల్లె పట్టణంబులనక
పల్లేరై తిరిగినాను
మురికికేట నడుమవున్న
ఇరుకులలో యిరికినాను
కూటిపేద తన కబళము
నోటికీయ గుడిచినాను
పూలవాసనలు నిండిన
పాలరాతి మేడలలో
ఆయాసము కలిగించెడి
పాయసాలు మెక్కినాను
వాయువుతో పోటీపడు
వాహనాలు ఎక్కినాను
కంటకాల మధ్య నేను
కాలినడక నడిచినాను
కాలు బైట పెట్టకుండ
కాలమెంతో గడిపినాను
గుట్టలపై యెక్కి యెక్కి
గట్టుల దిగజారినాను
లోయలలో దూకి దూకి
లోతులెన్నో చూచినాను
నే ప్రాకని ఎత్తులేదు
నే జారని లోతు లేదు
మూలజేరి మునులవోలె
మూగనోము బట్టినాను



ఈగవోలె దోమవోలె
వాగుచు తిరుగాడినాను
అతిథివోలె వుండి వుండి
అవని విడిచి వెళ్ళుతాను

1958, 26-1-58 'ఉషస్సు' పత్రికలో ప్రచురితం

తిమిరజ్యోతి

పండువెన్నెల దాల్చి
ప్రసవవేదన తోడ
నెలవంక కనబోవు
నిండుపొద్దుల రేయి

ఒక వంక తెగతెంపు
ఒక వంక బిగియింపు
హాహా ల చెలిమిలో
హాయి తొడికిసలాడు

తిమిరాల కడుపులో
తేజాలు జనియించు
అమావాస్య నిశికింత
పాడలేల బెగడేల?

1958



మళ్లీ మహాభారతం

కన్యకుమారింటడుగే
కశ్మీరమునకు పునాది
కడలిబాయు ఆవిరులే
గంగ జీవనమునకాది

చీర అంచు అంటుకుంటే
ఆపాదమస్తకం అలజడి
కొప్పుపట్టి లాగితే
అరికాళ్లు నిప్పులు త్రొక్కినట్లు
దుండగీడు కన్నుగీటితే
శీలవతి కన్నుల్లో
శివుని చిచ్చుకంటి మంటలు

సైరంధ్రి అవమానిత అయినప్పుడల్లా
కీచకవధ జరుగక తప్పదు
ద్రౌపది అభిమానానికి క్షతి జరిగినప్పుడల్లా
దుర్యోధనుల తొడలు విరుగక తప్పదు
దుశ్శాసనుల ఎదలు పగులక తప్పదు

ఎన్నిసార్లు కీచకవధ జరిగినా
దుశ్శాసనుల గుండెలు పగిలినా
దుర్యోధనుల తొడలు విరిగినా
కర్ణుల రథచక్రం భూమిలో క్రుంగినా
ఎన్నిసార్లు కృష్ణులు రాయబారాలు జరిపినా
మళ్లీ మహాభారతం

మళ్లీ మళ్లీ కీచకులకు సుధేష్ణల అండ
దుశ్శాసనులకు దుర్యోధనుల ఆదేశం
దుర్యోధనులకు దురాశ దురభిమానం
కర్ణులకు పగ సాధించే కసి



మళ్లీ కృష్ణుల రాయబారాల అవసరం
మళ్లీ మహాభారతం

మళ్లీ మళ్లీ భీష్మద్రోణుల మూగనోము
ధృతరాష్ట్రుల గుడ్డి ప్రేమ వ్యామోహం
శకుని మామల పాచికల పేచీలు
మళ్లీ ద్రౌపదికి తలవంపులు
మళ్లీ మహాభారతం

మళ్లీ మళ్లీ
సైంధవులకు వరాలు
ఆచార్యుల పద్మవ్యూహాలు
యోధానుయోధుల పన్నాగాలు
మళ్లీ అభిమన్యుల చిత్రవధలు
మళ్లీ మహాభారతం

మళ్ళీ మళ్లీ కాశ్మీరముపై దురాక్రమణ
ఐ.రా.స. సంధి పరామర్శ
కాల్పుల విరమణ ఒప్పందం
విరమణ ఒప్పందం కాల్పులు
భారత ధర్మజుల ఓర్పులు
మావో సేతుంగ్ పాచికల పేచీలు
అయూబ్ దుర్యోధన దురాశా దురభిమానం
భుట్టో దుశ్శాసన దురావేశం
మళ్లీ దుర్యోధనుల తొడలు విరుగక తప్పదు
దుశ్శాసనుల ఎదలు పగులక తప్పదు
మళ్ళీ కురుక్షేత్ర యుద్ధం తప్పదు
మళ్ళీ మహాభారతం తప్పదు.

1966



గొర్రెదాటు

దగాగడ్డి కరుస్తాంది గొర్రె
వగలగాలి పీలుస్తాంది గొర్రె
పగల నీళ్ళు తాగుతాంది గొర్రె
మందలపడి మురుస్తాంది గొర్రె
తెగ బలుస్తాంది గొర్రె
బళ్ల యాకరణం నెమరేస్తాంది గొర్రె
'ల' 'ర'ల అభేదం గురితిస్తాంది గొర్రె
గొల్లన్నను గొర్రన్ననుకుంటాంది గొర్రె
మందల పడి మురుస్తాంది గొర్రె
తెగబలుస్తాంది గొర్రె
గొల్లన్న గొడ్డలి పేడే తన కొమ్మనుకుంటాంది గొర్రె
గొల్లన్న పిడికిలే తన తలముట్టనుకుంటాంది గొర్రె
గొల్లన్న గొంతుల హుస్‌తుర్లే తన కాళ్ళనుకుంటాంది గొర్రె
మందల పడి మురుస్తాంది గొర్రె
తెగ బలుస్తాంది గొర్రె
గొల్లన్న తొక్కిందే బాటనుకుంటాంది గొర్రె
తలవంపుల్లో అదుగుజాడ కంటాంది గొర్రె
పసిబిట్ట పాదం మోపుతాంది గొర్రె
మందలపడి మురుస్తాంది గొర్రె
తెగ బలుస్తాంది గొర్రె

ప్రపంచం సాంతం గొల్లన్న కట్టిన గవ్వకు
కొరగాదనుకుంటాంది గొర్రె
లోకమంతా గొల్లన్న కట్టిన గజ్జెకు
వజ్జె[1]నుకుంటాంది గొర్రె
గొల్లన్న జెకుముక మిరుగుడు పడి
రగిలిన కున్నే[2] పొద్దనుకుంటాంది గొర్రె



మందలపడి మురుస్తాంది గొర్రె
తెగ బలస్తాంది గొర్రె

గొల్లన్న ధర్మాన్ని చూస్తాంది గొర్రె
గొల్లన్న దయను తలుస్తాంది గొర్రె
గొల్లన్న త్యాగం కొలుస్తాంది గొర్రె
మందలపడి మురుస్తాంది గొర్రె
తెగ బలుస్తాంది గొర్రె
బయళ్ళగడ్డి గొల్లన్నే మొలిపిస్తాండనుకుంటాంది గొర్రె
సెలయేళ్ల నీళ్ళు గొల్లన్నే ఒలికిస్తాండనుకుంటాంది గొర్రె
గొల్లన్న పెయ్యొలిచిన గొంగడిబొచ్చే
తన మెయినిండా మొలుస్తాందనుకుంటాంది గొర్రె
మందలపడి మురుస్తాంది గొర్రె
తెగ బలుస్తాంది గొర్రె
గొల్లన్న యాతనంతా తన కోసమే అనుకుంటాంది గొర్రె
గొల్లన్న కాలిచే మల్లన్న తానే అనుకుంటాంది గొర్రె
మోసంలో పడి మోచ్చం చూస్తాంది గొర్రె
మందలపడి మురుస్తాంది గొర్రె
తెగబలుస్తాంది గొర్రె
గొల్లన్నే గొర్ల పాణాలు నిలుపుతాండనుకుంటాంది గొర్రె
గొల్లన్నపై పంచపానాలు నిలుపుకుంటాంది గొర్రె
గొల్లన్న పాదాలపడి పాణాలు వదలాలనుకుంటాంది గొర్రె
మందలపడి మురుస్తాంది గొర్రె
తెగబలుస్తాంది గొర్రె
గొర్రెదాటు కనుకట్టు నిలుపుకుంటాంది గొర్రె
మందకుక్కది పిచ్చి మొరుగుడనుకుంటాంది గొర్రె
దాని దొడలు దగ్గర పడితే హాయనుకుంటాంది గొర్రె



మందలపడి ముసురుస్తాంది గొర్రె
తెగబలుస్తాంది గొర్రె

దగా గడ్డి కరుస్తాంది గొర్రె
వగలగాలి పీలుస్తాంది గొర్రె
పగలనీళ్ళు తాగుతాంది గొర్రె
మందలపడి ముసురుస్తాంది గొర్రె
తెగబలుస్తాంది గొర్రె

18-1-1967

1. కమీషన్, 2. రాజుకున్న పిడుక

3. పెయ్యి + ఒలిచిన = శరీరము నుండి ఒలిచిన



రుతువు మారుద్ది

ఈదరీసుద్ది యీసుద్ది చీదరేసుద్ది
ఆకువండుద్ది ఊగుద్ది ఊగిరాలుద్ది
బతుకు పోరుద్ది పోరుద్ది రుతువు మారుద్ది
డోలు మోగుద్ది మోగుద్ది సందణుగుద్ది సద్దుమణుగుద్ది
వత్తి వెలుగుద్ది వెలుగుద్ది వెలిగి మలుగుద్ది
బ్రతుకు పోరుద్ది పోరుద్ది పోరుమానుద్ది
చినుకు జారుద్ది యింకుద్ది కెలకపూరుద్ది
ఏరు చేపుద్ది తాపుద్ది ఏరుపారుద్ది
చేను యింకుద్ది ఎండుద్ది గింజరాలుద్ది
బ్రతుకు పోరుద్ది పోరుద్ది రుతువు మారుద్ది
మోడు ఎండుద్ది ఎండుద్ది బెరడు చిట్లుద్ది
కొమ్మ మురుసుద్ది మురుసుద్ది చిగురు విత్తుద్ది
బ్రతుకు పోరుద్ది పోరుద్ది రుతువు మారుద్ది

1967

తేలిక

తాలు తేలిక
తాలు కన్నా బాతాలు తేలిక
బాతాల కన్నా బాతాల పోతు తేలిక
వానికన్నా తేలిక మరేది లేదంటే
నేనున్నానని చెవులు కోసుకునే
వాడొస్తాడు ముందుకు

1966



ఆ కళ్ళు

ఆకళ్ళ కళలు ఆ కళ్ళు
ఆ కళ్ళు కళల ఆకళ్ళు
ఆకళ్ల కలలు ఆ కళ్లు
కలల ఆకళ్లు ఆ కళ్లు
పువ్వుల్లో ముళ్ళు ఆ కళ్ళు
దేవుళ్ల గుళ్ళు ఆ కళ్ళు
దయ్యాల నెగళ్ళు ఆ కళ్ళు
బ్రతుకుల బయళ్ళు ఆ కళ్ళు
బ్రతుకులకు దళ్ళు ఆ కళ్ళు
మరియాదల మళ్ళు ఆ కళ్ళు
యాది ఎద గూళ్ళు ఆ కళ్ళు
నడవళ్ళ కళ్ళు ఆ కళ్ళు
నుడువుళ్ళ దళ్ళు ఆ కళ్ళు

ఆ కళ్లు మల్లె పందిళ్లు
ఆ కళ్లు ముల్లె విప్పుళ్ళు
ఆ కళ్ళు పరువు సావళ్ళు
ఆ కళ్ళు బరువు కావళ్లు
ఆ కళ్ళు సిగ్గు విసురుళ్ళు
ఆ కళ్ళు పెగ్గు మెసలుళ్ళు
ఆ కళ్ళు మమత విసురుళ్లు
ఆ కళ్ళు సమత దొసగుళ్ళు
ఆ కళ్ళు కొంగు తావిళ్ళు
ఆ కళ్ళు కొంగ తావళ్లు
ఆ కళ్ళు ప్రణయాల అంగళ్ళు
ఆ కళ్ళు ఆకళ్ల మూకుళ్ళు



అ కళ్ళు బ్రతుకు దోపిళ్లు
అ కళ్ళు బిచ్చపు దోసిళ్లు
అ కళ్ళు మీనాసి పిడికిళ్లు
అ కళ్లు కడుపు కడలిసుళ్లు
అ కళ్లు ముచ్చట దీర్చు ముళ్లు
ముడుచుకున్న మొగుళ్ళు అ కళ్ళు
రగులుకొన్న మొగుళ్ళు అ కళ్ళు
సెలవేసిన పుళ్ళు అ కళ్ళు
అ కళ్ళు కంచాల ఆకళ్ళు
అ కళ్ళు మంచాల ఆకళ్ళు
ఆకళ్ల మొదళ్ళు అ కళ్ళు
ఆకళ్ల కుదుళ్ళు అ కళ్ళు
అ కళ్ళు చదువుల ఆకళ్ళు
అ కళ్ళు పెదవుల ఆకళ్ళు
అ కళ్లు అసువుల ఆకళ్ళు
అ కళ్లు వసువుల ఆకళ్లు
బ్రతుకు చట్టాల సవరణలు అ కళ్లు
బ్రతుకు చట్టాల వివరణలు అ కళ్లు
పోషణాల కావళ్లు అ కళ్లు
శోషణల వేవిళ్లు అ కళ్లు
దూషణల వాగుళ్లు అ కళ్లు
శాసనల సాలీళ్లు అ కళ్లు
కష్టాల వాకిళ్లు అ కళ్ళు
ఇష్టాల కొగిళ్ళు అ కళ్ళు
అగ గదుముళ్ళు అ కళ్ళు
సాగముగుదాళ్ళు అ కళ్ళు
అ కళ్లలో దాగలేని ఆకళ్ళు
ఆకళ్లను దాచలేని అ కళ్ళు



గుట్ట అనకట్ట పగుళ్ళు ఆ కళ్ళు
ఆ కళ్లు వెన్నెల సెలయేళ్ల ఆకళ్ళు
ఆ కళ్లు ఎడారి ఎండమావుల కాళ్ళు
ఆ కళ్లు ఎదిగిన పంటపైర్ల దాళ్ళు
ఆ కళ్లు గొంతులకు సరిపోని తాళ్ళు
ఆ కళ్లు బ్రతుకు మొలకల వేళ్ళు
ఆ కళ్లు చటుక్కున కాటేసే తేళ్లు
ఆ కళ్లు బ్రతుకు సూత్రం తెగుళ్లు
ఆ కళ్ళు చావు సూత్రం అమళ్ళు
ఆ కళ్లు ప్రణయ ప్రళయాల రుమాళ్ళు
ఆ కళ్లు చావు బ్రతుకుల సవాళ్ళు
కొంగు బంగారం ముళ్ళు ఆ కళ్ళు
కొంగజపానికి దళ్ళు ఆ కళ్ళు
ఆ కళ్ళు వరూధిని కళ్ల ఆకళ్ళు
ఆ కళ్లు గాంధారి కళ్ల మూకుళ్ళు
సావురాల పచ్చడి రోకళ్లు ఆ కళ్ళు
గోముతొక్కు లాటరోళ్ళు ఆ కళ్ళు
ఆ కళ్ళు కడుపు తరుగుళ్ళు
ఆ కళ్ళు కసుల మురుగుళ్లు
ఆ కళ్ళు బులుపు చిదిమిళ్ళు
ఆ కళ్ళు వలుపు అదుముళ్ళు
ఆ కళ్ళు పలుకులకు బళ్ళు
ఆ కళ్ళు కులుకులకు ఇళ్ళు
ఆ కళ్ళు తోకళ్ళు వూపుళ్ళు
ఆ కళ్ళు దేగ దూకుళ్ళు
కొరగాని కంకుళ్ళు ఆ కళ్లు
ఎరమింగ వూరిళ్లు ఆ కళ్లు



మునిగాని పూరిళ్లు ఆ కళ్ళు
మొనగాని దోపిళ్లు ఆ కళ్ళు
గిజిగాని దూగుళ్లు ఆ కళ్లు
రుజువర్తనకు గాళ్ళు ఆ కళ్ళు
అద్దరేతిరి పగళ్లు ఆ కళ్లు
ముద్దబంతుల బోళ్ళు ఆ కళ్ళు
సద్దుమడిగిన దోళ్ళు ఆ కళ్ళు
భ్రాంతి ఎదుగుళ్ళు క్రాంతి ఒదుగుళ్ళు
ఎండమావుళ్ళు వానవడగళ్ళు
బ్రతుకు మురికి బాత వుతుకుళ్లు
బ్రతుకు చాకిరేవు చాకళ్లు
అడివి అమ్ముళ్లు కొరివి కొనుగోళ్లు
అమ్మ అంగళ్లు సాని చావళ్ళు
కసుల దాగుళ్ళు బుసల పాకుళ్ళు
దిసల నడవళ్ళు దాగ వాగుళ్ళు
విలసతకు విడుదళ్లు ఆ కళ్ళు
సానకు గంధాల తాపిళ్లు ఆ కళ్లు
సానికి రాబళ్ల తాపిళ్ళు ఆ కళ్ళు
ఫిర్యాదుల దోళ్ళు న్యాయంకొండ చెవుళ్ళు
నేలబాకోళ్ళు నింగి నిట్టాళ్ళు
చిచ్చుకంటి దగళ్ళు రక్తి కన్నీళ్ళు
కోరికల గోళ్ళు తీరికల సీళ్ళు
అడివి అమ్ముళ్ళు కొరివి కొనుగోళ్ళు
బైరాగి రాగాల గునుసుళ్ళు ఆ కళ్ళు
రాగి వైరాగ్యాల పొగులుళ్ళు ఆ కళ్ళు

1966



కవిగూడ నేతగాడే

కవి గూడ నేతగాడే
బహు చక్కని సాలెగూడు అల్లువాడే
రాజకీయ బల్లీ(యు)ల
నోటికి అందక ఎగిరెడి పక్షీ(యు)ల
చూపుల కనుపించనట్టి
సుకుమారపు సూత్రాలతొ -
బహు చక్కని సాలెగూడు అల్లువాడె
కవి గూడ నేతగాడె
రాజకీయ బల్లీ(యు)ల
రక్తసిక్త హస్తాలతొ ఎగరేసిన
తెలతెల్లని కపోతాలు వాలగ, కూర్చొని పాడగ
క్రైత; సింగిడీల దీర్చు
కవి గూడ నేత గాడె
బహు చక్కని సాలెగూడు అల్లువాడే

1972



శ్రీశ్రీ

నీవు కోరేది సర్వమంగళమైనపుడు
నీ ముడుపు దేవుడెవడైతే మాకెందుకు
నీవు రాసి పారేసిన కవితలు గుబాళిస్తున్నప్పుడు
నువు తాగి పారేసిన సీసాల కంపు మాకెందుకు?

మెప్పించే భావనా బలం నీకున్నప్పుడు
నీ భావాల కులగోత్రాలు మాకెందుకు?
తెనుగు 'వాడి'ని వాడే ప్రతిభ - నీకున్నప్పుడు
తెగిపడుతున్న దుష్టాంగాలపై జాలెందుకు?

1970 విశాఖ మునిసిపల్ స్టేడియంలో జరిగిన శ్రీశ్రీ షష్టి పూర్త్యబ్ద సభలో చదివిన గేయం

తినలేక/ తినలేక

ఒకడు కుతికెలదాక
మెక్కినోడు
మరొకడు మింగ మెతుకు
లేనోడు
ఇద్దరికీ గొంతు పెకలదు
ఇద్దరికీ ఊపిరాడదు
ఇద్దరి అవస్థకు
ఒకే కారణం -
తినలేక

1974



ప్రశ్నలు

పరిస్థితులెట్లా వున్నాయని కాదు
పరిస్థితుల్లో మనమెట్లా వున్నామని?
కొత్త ఏడెట్లా వుంటుందని కాదు
మనం కొత్త ఏట్లో ఎట్లా మునిగి తేలుతామని?
బ్రతకాలనే ఆరాటముండగా చావడం ఎట్లా అని కాదు
అనుక్షణం చావాలనిపిస్తూ బ్రతకడం ఎట్లా అని?
"గడించిన అలౌకిక శాస్త్రీయ జ్ఞాన విజ్ఞానం ఎంతని కాదు
పోగొట్టుకున్న సామాన్య జ్ఞాన మెంతని?"
'బ్రతికి వున్నామని
చచ్చేదాకా బ్రతికి వుంటామని
చావువేళ తప్పేది కాదని
ముందుకూడ రానే రాదని'
మనకెంత మాత్రం తెలిసిందని ప్రశ్న
అనుక్షణం చావుకై నిరీక్షించే
మనం బ్రతికి చచ్చిందెప్పుడు?
ఇంతకూ మనం ఇప్పుడు చావడం మాత్రం ఎట్లా?
మనం పడే పాట్లెన్నని కాదు
ఈ పాట్లన్నీ ఎందుకూ అని ప్రశ్న?
ఎప్పటి ఏడ్పు అప్పుడు ఏడిస్తే సరిపొయ్యే దానికి
ఎట్లా ఎడిస్తే
అసలు ఏడ్పన్నది లేకుండా పోతుందని ఏడ్పు ఎల్లప్పుడు
ఏమిటీ విపరీత బుద్ధి!
బిట్టెడు పొట్టకు చేరెడు నేల పండిస్తే చాలు
చిట్టెడు అలికితె పుట్టెడు
ఈ మాత్రం తెలిస్తే బ్రతుకు తేలిక
భారీ మనుషులకు బ్రతుకు తేలిక కావడం గిట్టదు



'మరే'ంద్రులు వారు
చేతుల, చేతలు వారి మరలకు సరిపడవు
'కు'బేరులు వారు
పంటలు వారి బేరాలు సాగనీయవు
వారసామాన్యులు
సామాన్యులంటే వారి కసహ్యం
సామాన్యుల సంఖ్య పెరిగితే వారికి భయం
తమ ఆటకట్టకుండా చూసుకుంటారు
ఎప్పుడు సరికొత్త ఎత్తులు వేస్తారు
ఉన్నవారికి బ్రతుకు లేకుండా చేస్తారు
ముందు వారిని పుట్టకుండా చూస్తారు
ఇదంతా మన కోసమంటారు
కాని మనం దీన్ని నమ్మడం ఎందుకని ప్రశ్న
ఉన్న దాన్ని - పూటపూటకు పుట్టుకొచ్చే దాన్ని
ఎప్పటికప్పుడు తీర్చుకుంటే తీరేదాన్ని -
అసలు లేకుండా చేద్దామని ఆరాటం, ఏడ్పు, ఎందుకని ప్రశ్న
ఏదో అడుగు తీసి అడుగేసే దానికి
ఏ అడుగెట్లా పడుతుందోనని
ప్రతి అడుగూ ఆచితూచి వేద్దామని
కంటకాలు లేకుండా చూచి
పూల మీదే పాదం మోపుదామని
పూలబాటే ఏర్పడ్డాక
ప్రయాణం ప్రారంభిద్దామని ఉపేక్ష
కంటకాలు లేని బాటే లేదాయెనని
ఏడ్పు ఎల్లప్పుడు
మరల మహిమా ప్రాబల్యమెంతని కాదు
ముడుచుక కూర్చున్న చేతులది ప్రశ్న



తుడిచిన అద్దం వంటి పట్టణ వీధులది కాదు
ముక్కు పుటాలను చీల్చే మురికి పేటలది ప్రశ్న
చంద్రమండలంలో ఆవాసమెప్పుడని కాదు
భూమండలం మీద ఆదిమవాస మెన్నాళ్ళని ప్రశ్న
మరేంద్రుని మజా ఎంతని కాదు
సామాన్యుని బ్రతుకు యిరుసు, గీరలకు మధ్య
జనుమూ ఆముదం ఎంతని ప్రశ్న
పరిస్థితులెట్లా వున్నాయని కాదు
పరిస్థితుల్లో మనం ఎట్లా వున్నామని
కొత్త ఏడెట్లా వుంటుందని కాదు ప్రశ్న
కొత్త ఏట్లో మనమెట్లా మునిగి తేలుతామని ప్రశ్న
స్థాయి జంగమమై కూడ
స్థితి, గతి లేక స్థావరమెందుకైందని ప్రశ్న
వాడెవడో బోడంతా చేస్తున్నాడని కాదు
మనం వాని చేతులో తలెందుకు పెడుతున్నామని

1973 - ఉగాది



సిరాచుక్క

A Single drop of Ink
that make the millions to think" BYRON.

ఒకే ఒక్క సిరాచుక్క
లక్ష మెదళ్ళకు కదలిక
అన్నాడు బైరన్
నిజమేనా అది?
మరి నేను ఒలక బోసిన
సిరా సీసాల కొద్ది గాదు
పీపాల కొద్ది
ఏ ఒక్క మెదడు కదిలినట్టు లేదు
మొదట నా మెదడులో ఉంటేగా కదలిక
మరోడ్ని కదిలించ

23-11-1975 ఎమ్మిగనూరులో

మనిషి ఎంత మంచివాడు

మనిషి ఎంత మంచివాడు
చనిపోయిన వాని చెడును
వెను వెంటనే మరుస్తాడు
కని మంచినె తలుస్తాడు

మనిషి ఎంత చెడ్డవాడు
బ్రతికివున్న మనిషిలోని
మంచినెపుడు గుర్తించడు
చెడును వెతికి కెలుకుతాడు



ఇంతకన్న చావు నయం

ఇంతకన్న చావు నయం
ఇంక నేను బ్రతికున్నన?
నా గొడవకు నిప్పుపెట్టి
నా గొంతును అదిమి పట్టి
ఎమర్జెన్సి సామ్రాజ్యం
ఎదిగి మిడిసి పడుతుంటే
ఇంతకన్న చావు నయం
ఇంక నేను బ్రతికున్నన?
పొరునిగ పలుక వీలు లేనప్పుడు
బ్రతికెందుకు? కాళోజీ
ఎమర్జెన్సి సబబె అంటె
ఇందిరకు జై అంటె
పత్రికల్లో పడవచ్చు
బాగా సుఖపడవచ్చు
ఏకీభవించనోని పీకనొక్కు సిద్ధాంతం
అంటేనే ఎమర్జెన్సీ
అంతేనా? రాష్ట్రపతి
ఆవు దూడ ముద్దెరతో
యావద్భారతమున జరుగు
ఆర్భాటం నిజమైనా
ఆ మాటను ఎదిరించే
అవకాశం లేనప్పుడు
భిన్నాభిప్రాయ మేమి
ఉన్నదో లేదో కాలిచే
ఆస్కారం లేనప్పుడు
అంతా భేష్ అనే మాట
కర్థమేమిటి అంటా?



ఫాసిజం కాదా ఇది?
ప్రజాస్వామ్య ముందా?
రాజ్యాంగం సమకూర్చిన
అవకాశమె ఎమర్జెన్సీ
ఎమర్జెన్సీ. పరిపాలన
కూడ ప్రజాస్వామ్యంచే
అని ఇందిర చాటితేమి
పౌర జీవితమ్ము కాలి
కమురు కంపు కొడుతుంటే
ఎమర్జెన్సీ అత్తరుతో
ఏమాత్రం అపగలవు
రాష్ట్రపతి ఏమంటవు.

ఎమర్జెన్సీలో 1-7-1975



సురవరం ప్రతాపరెడ్డి

ప్రాథమిక సత్వాల పథము జూపిన మనిషి
వాల్మీకమున క్రొత్త వార్త లేరిన మనిషి
సంఘవరమౌ చరిత సంగ్రహించిన మనిషి
గ్రంథాలయోద్యమము గాథ చెప్పిన మనిషి
ధర్మవీరుల గాథ త్రవ్వితీసిన మనిషి
భావ దాస్యపు భ్రాంతి బాప పుట్టిన మనిషి
కోడిపుంజై వెలుగు జాడ పాడిన మనిషి
హిందువుల పండుగల ఎంచి చెప్పిన మనిషి
మనసులో ఎలాంటి మబ్బులేని మనిషి
పీడ జాడా లేని పిడుగు వంటి మనిషి
మురిసి పోవగ కనుల మెరిసి పోయిన మనిషి
లక్ష్యసిద్ధికి అక్షరాల వాడిన మనిషి
పలుకు పలుకున ఆత్మబలము కలిగిన మనిషి
ఊపిరిని ఆత్మబలముబుకుచుండిన మనిషి
చిత్ర చైతన్యమై చిందులాడిన మనిషి
కర్రుకత్తుల పదును కలములో గల మనిషి.

దాస్యము నెదిరించె ప్రతాపుదాతడు నిజము
భ్రాంతులను తొలగించె ప్రభాతమాతడు నిజము

గోలకొండను అక్షరాల కట్టిన వాడు
నడమంతరపు దొరల పాడలగొట్టినవాడు
బ్రతుకు అనదగు బ్రతుకు బ్రతక గలిగినవాడు
చచ్చి బ్రతుకుతున్న స్థాయి తప్పనివాడు
'అరువు కౌలుల' కళల మురిసి పోలేదతడు
పరపింఛముల దాల్చి మెరిసి పోలేదతడు
మరుగు బేరాలాడు సిరి కోరలేదతడు
పరుల పాపపు తొనలు వరదాన మనుకొనుచు
పలికి కులుకుచు బ్రతుకు చిలుక కాలేదతడు



కాకి పొదగగ చిట్టి కావుకావనలేక
కాకి బలగము కాయు కోకిలయు కాదతడు

అతడు మేల్మొని చూడ ఆ నాటి సంఘమున
ఇరుగు పొరుగును తుడిచి పెరిగి పోయినవారు
మరుల బేరాలాడి సిరుల దేలినవారు
గుత్తాలతో కోట్లు కొల్లగొట్టిన వారు
పేద సాదలు ఏడ్వ మోదమందిన వారు.
'కంచె చేనును మేయు' కథకు గుర్తుగువారు
బానిసత్వము బ్రతుకె భాగ్యమను కొనువారు
బూజుపట్టిన రాజు పూజ చేసెడివారు
దుష్టకూటమి కృపా దృష్టి కోరెడివారు
ఎందరెందరో అతని ముందు సుఖముల నొంద
కష్టాల కోరుకొని నష్టాల కోర్చుకొని
ప్రజల పక్షము జేరి, బ్రతుకు బ్రతికిన మనిషి
మరవరానీ మనిషి మరపురానీ మనిషి

దరబారు కాయు చౌదరికాడు కాదతడు
సరకారు మోయు చౌదరి కాడు కాదతడు
పరువు గిర్వెడెడి చౌదరికాడు కాదతడు
పరుల కీడెంచెడి చౌదరికాడు కాదతడు
దారులడ్డెడి చౌదరికాడు కాదతడు.
దారి కానక తిరుగువారి కాదరు వతడు
దారి వెతుకుచు తిరుగువారి చౌదరి అతడు
కదలి కదలించె మము కాన చౌదరి అతడు
కాంచె కాగలదాని కాన చౌదరి అతడు
కదిలించి ఎందరినో కవుల జేసిన వాడు
కవుల మాటల కెంతో కదలి పోయిన వాడు



'నా గొడవ' ప్రకటింప నాంది అయిన వాడు
మాడపాటి తాతయ్యకు తోడు నీడ అయిన వాడు
రెడ్డి పేరుకు తగిన దొడ్డబుద్ధి గలవాడు

కావుదలకు వన్నె తెచ్చు కలుపుగోలు తనమువాడు
కులము పేరున ఏ మనిషిని కొలచి ఎరుగని వాడు
కులము మాట గుణము కొలువ తలచి ఎరుగని వాడు
ముసుగుల్లో గుద్దులాట ముచ్చటయే లేనివాడు.
మాయ, మోసం, కుట్ర మచ్చుకైన లేనివాడు
పేద నాదుకొనగ దొరల మీదికురికినట్టి వాడు
కీర్తిశేషుడను మాటకు గీటురాయి అయినవాడు
ఏ పాపము ఎరుగనట్టి పాపయ్య పటేలు
పాపాల కోటలను పడగొట్టు పొట్టేలు



కేశన్నా!

ముద్దులొల్కెడి మోము దిద్ది తీర్చిన జుట్టు
పెద్దవానికి లోటు కావన్న
మొండిచేతుల అంగి మోకాళ్లు దాటని
మొలగుడ్డతో తిరుగు కేశన్నా!
ముస్తాబు జేసుకొని మోటార్ల షికారుగు
మురిపెంబు నీకేమి లేదన్నా!
వల్లెబాటల బాధ ప్రజలతోబాటు
నీ బరికాళ్ళకే బాగ గురుతన్న!
జబ్బులేని వాళ్ళ గబ్బులేని మనసు
ఉబ్బులేని జేబు నీదన్న!
అటుకులూ పుటనాలు అరగిస్తూ దేశ
మంతటా అగుబడ్డ కేశన్నా!
స్నేహభావము తోడ సేవ జేయుట ఒకటే
చేతనాయెను నీకే కేశన్నా!
సర్దారు నామంబు సహజనామంబుగా
నరిపోయినది నీకు కేశన్నా!

జమలాపురం కేశవరావు గారి



హార్టిస్టే ఆర్టిస్టు

హార్టిస్టు కానివాడు
ఆర్టిస్టు కాగలడా?
ఎద పదును లేనివాని
పదము పదును చిందేనా?
కోతకు అక్కరకొచ్చే
పదును కాదు ఎద పదును
కోతల కక్కరకొచ్చే
పదును కాదు మాట పదును
గాయపడిన ఎద పదము పదును
చెమ్మగిలిన కంటి పదము పదును

కడుపు చెరువై పొంగి పొంగి
పారినప్పుడు కైత ఒలుకు
మనసు రగిలి రగిలి మండి
వెలిగినపుడు కైత వెలుగు
ఆవేశము ఆలోచన
వేపుడైన మజా కవిత
ఉద్రేకం పరాకాష్ఠ
జెందినపుడు మనిషి ఊహా
నింగి వదిలి శివుని తలను
దూకెడి గంగను బోలును

హార్టిస్టు కానివాడు
ఆర్టిస్టు కాగలడా?



పౌరులమా? పురుగులమా?

మనమెవరము - మనమెవరము
ప్రజాస్వామ్య - రాజ్యాంగము
పరిపాలనగల - భారత పౌరులమా?
లేక మనం ఆతతాయి - ఆగడాల
దైనందిన చర్యలకు - జడసి జడసి
దేబెల వలె బ్రతుకుచున్న పురుగులమా?

పౌరజీవితము స్థాయి- దిగజారిన దేస్థాయికి
ముఠా రాజకీయాలకు - పరివారమై గుండాలు
పట్టపగలు పట్టణములో వీరవిహారం చేయగ
చట్టబద్దులగు దేబెలు
గొర్ల మందలై పారగ
లూటీలను దహనాలను
దోయబడెను మానాలను
పోలీసులు దాపునుండి
దండపాఁయిలై చూడగ
తెరవెనుక సూత్రధారి
సళ్ళు బిగువు చాకచక్య
ధోరణితో చేజిక్కిన అధికారం
'సక్రమ' దుర్వినియోగం
గండె కొట్టు వైనంతో
గుండాయిజం ఆపుదలకు
ప్రభుత్వ గుండాయిజం చేబట్టగ
మనమెవరము - మనమెవరము
ప్రజాస్వామ్య రాజ్యాంగము
పరిపాలనగల భారత పౌరులమా?
లేక మనం ఆతతాయి ఆగడాల
దైనందిన చర్యలకు జడసి జడిసి
దేబెల వలె బ్రతుకుచున్న పురుగులమా?



తకుకు తకుక్కను తారను...

నింగి గుదారం నీలిమ
నుండి వంగి వంగి చూస్తు
పుడమితల్లి ఒడి చాచిన
ఆకుపచ్చ తివాచీల
పైరాలిన దాన్ని నేను
మొగులు వెలుగుల బానను
నీలి గుదారం నుండి
ఆకుపచ్చ తివాచీపై రాలిన
దాన్ని నేను.
నేనొక కరుణ కోమలమైన మాటను
ముచ్చటలు దీర్చేటి మూటను
ప్రకృతి సుందరి గళము వెలువడి
మాటి మాటికి బైట పడుదానను.

తకుకు తకుకుమనుదానను
మినుకు మినుకుమను దానను
నింగి గుదారం నీలిమ
నుండి వంగి వంగి చూస్తు
ఆకుపచ్చ తివాచీలపై
రాలిన దాన్ని నేను.
హేమంతము సీమంతము కల దానను
వసంతాన పురుడు పోసుకొను దానను
చలికాలుని మరిగి కూడి
పంచ మహా ప్రాణాలు
కనిపెంచిన గారాబాల బోడి నేను

వాసంతిక మంత్రసాని
చేతి చలవ అందాలు, సుకుమారము
ఒయ్యారం, ఒలుకుతాడు



ఒడలంతయు నునుపు బడి
గ్రీష్మం వెచ్చని మెత్తని తొడపైన
నే ఎదిగి, దిగి, వర్షంలో జలకమాడి
శిశిరం, చల్లని ఒడిలో
తలదూరిచి నిద్రింతును

ముద్దులొల్కు రంగులతో
తీరు తీరుగా
వేసిన ముగ్గు చాళ్ల శోభ గూర్చు
మైదానాలకు నేను.

బయళ్ళన్ని నా రంగుల శోభల
తో విరాజిల్లు
నా కమ్మని కొగిళ్లతో
గుబాళిస్తు గాలిగాడు
పూలరంగడై తిరుగును

కలతెరుగని మత్తునిద్ర
హాయిగ నను హత్తుకొనగ
వేయి కనులతోడ రేయి
కాచి నన్ను కాపాడును.

పైరగాలి గిలిగింతలు, పెట్టి
నన్ను మేలుకొలుప, ప్రొద్దు
పొడుపునే చూతును, రెప్పనైన
వాల్చకుండ, దినముఖమున
వెలయుచున్న, కన్నొకటి
సూర్యుడెగద.

పైర సార తప్ప క్రాగి, పక్షి
కల కూజితాల వినుచు, ఆకులు
తప్పెట్లు కొట్ట ఊగిసలాడెను



గిలితో రాగ తాళ లయ
బద్ధముగాను నేను నర్తింతును

ప్రేమికుల కలయిక కానుకను నేను
నవ దంపతుల కంఠమాల నేను
ఒకానొక సుఖానుభూతి
స్మృతి చిహ్నాన్ని నేను.
బ్రతికి యున్నవారు
చనిపోయిన వారి కర్పించెడి
తుది కానుకను నేను
నే సుఖదుఃఖముల భాగస్వామిని
నే నెప్పుడు పైకే చూస్తాను
కేవలము వెలుగ గల వైపే నా దృష్టి
నా నీడను చూచుటకైనా
నేను నా చూపును దించను
మనిషి నా నుండి నేర్చు
కొనవలసినదింతే

పైరగాలితోడ జేరి
ఎదురేగుచు లేపొద్దుకు
బాకా పడతాను నేను
పక్షుల కిలకిల దూరి
మలి సంజను వీపు తట్టి
వీడుకోలు పలుకుతాను

నా నీడను చూచు కొనగ
చూడను క్రిందికి ఎప్పుడు
వెలుగును గన నా చూడ్కుల
ఆకసాన నిలుపు దెప్పుడు.

1967



అందరివాడు

అందరి వాడైనవాడు
ఏ ఒక్కనికి అంకితమ్ము కాజాలడు
ఏ ఒక్కనికి అంకితమ్ము అయినవాడు
అందరికి అయినవాడు కానేరడు.

అందరికి అయిన వాడ్డి
ప్రతి ఒక్కడు నా వాడని
వాడు నావాడు కాకుండవుతున్నాడని
పడుచుండును ఆరాటము.

అందరి వాడైన వాడు
ఏ ఒక్కనికి అంకితమ్ము కాజాలడు
అందరి వాడైన వాడు
ఏ ఒక్కనికి
అన్ని తీర్ల అనుకూలుడు కాజాలడు

అందరి వాడైన వాడ్డి
ప్రతి ఒక్కడు
అన్ని తీర్ల తనకే అనుకూలుడు కాదని పడు ఆరాటము
అంత తుదకు విపరీతము

యీ నడవడి పరిణామము
ఆరాటము తీరనట్టి ప్రతి ఒక్కడు
అందరి వాడైన వాడ్డి
తనవాడసలే కాదని
తరిమి కొట్టి తృప్తి జెందు

అందరి వాడైన వాడు
ఏకాకే ఎల్లప్పుడు
అయినా అందరివాడె
ఏ ఒక్కనికి అంకితమ్ము కానివాడె.



అమ్మ...

నీ పొత్తిళ్ళిత్తి ఉతికి
నిన్ను యెదకు హత్తుకున్న అమ్మకు
నీ చెత్త చెదారం మనులకు
వీవు చెదర చరిచే అధికారం
ఎక్కడిదని అడుగకు
కొంగుతో నీ ముద్ది తుడిచినప్పుడే
కొనగోళ్ళకు నీ పిళ్ళ గిల్లే అధికారం వచ్చింది
ముక్కు చీమిడి తుడిచినపుడే
మూతి మీద గొట్టే అధికారం వచ్చింది
జగదంబకు మహిషాసురుడు కూడా పుత్రుడే
సంహారం జేసినపుడు
అంబ పేరు మహంకాళి
ఆదుకొన్నా అంతమొందించినా ఆమెయే మరి



శాస్త్రం పద్ధతి

శాస్త్రం పద్ధతి చెపుతుంది
ఆచరణ బ్రతుకు చాటుతుంది

శాస్త్రం ఆదర్శం వల్లె వేస్తుంది
ఆచరణ సాధ్యం నిరూపిస్తుంది

వ్యాకరణం రాజబాట వేస్తుంది
వాడుక పిల్లబాట తొక్కుతుంది

సమ్మత రూపదర్శనాభిలాషి పండితుడు
అగుపడ్డ రూపమె సమ్మతము సామాన్యునికి

ఎవనికో నచ్చునట్లు పలకడం నాడు
ఎవనికి వాడు వచ్చినట్లు పలకడం న్యాయం నేడు

ఎదుటి వానికి తెలిసిందా? అనే ప్రశ్న
పలికే వాడు వేసుకోవలసింది
వినేవాడు కాదు



శ్రీశ్రీ

పీడితజన పక్షపాతి
దోపిడి వర్గం విరోధి
శ్రీశ్రీ
అక్షరాల వరకే శ్రీశ్రీ
డబలుసిరి, కానేకాదు అనుకునేరు
అతనికేమి
శ్రీమంతుడే కాదు
డబలు శ్రీమంతుడు మన శ్రీశ్రీ
మాటల వాడీ వేడి ఎరిగినట్టి
అర్థవేత్త

చిరంజీవి దాశరథి

తమ్ములు వున్నారు నాకు తమ్ములు వున్నారు
కమ్మని కైతలురాసి ఇమ్ముగ వినిపించి మురియు
తమ్ములు వున్నారు నాకు తమ్ములు వున్నారు
'కాళన్న' అన్నమాట కలకాలం వుండునట్లు
కాళన్నాయని పిలిచెడి తమ్ములు వున్నారు
కరుణకు, కన్నీళ్ళకు, కావ్యానికి, కయ్యానికి
'దమ్ము' కాళన్నాయను తమ్ములు వున్నారు
విందుకు, విమర్శనలకు వినోదానికి వికటానికి
సొమ్ము కాళన్నయను తమ్ములు వున్నారు



చిరంజీవి సినారె

పాలుతేనియలూరు పూలపాటలుపాడి
కాళన్న మనసును కాజేసినావు
స్నేహమాలను జేరి స్నేహమాలగమారి
మనమనెడి మనసులో మనగలిగినావు
కమ్మకమ్మని కైతలిమ్ముగా వెదజల్లి
తమ్ముడా! ఎల్లెడల కమ్ముకున్నావు
అన్నలందరుజేరి చిన్నారి తమ్ముడ్డి
దివ్యకవితలు జల్లి దీవించుతున్నారు
దూరాన 'నా గొడవ' తారాడ రాలేక
స్నేహమాలగ నిన్ను చేరుతున్నాను



కొత్వాల్ తాత

తాత! కొత్వాల్ తాత!
కత చెప్త ఇంటవ
కతంటె కత ఎన్నాళ్ల కత
యాభైయ్యేళ్ల కత
నువ్వు పెట్టించిన హాస్టలే వున్నది
నువ్వు చూచింది కొంత
నువ్వు సూడంది ఈన
ఆడపిల్లల బళ్ళు నువ్వు పెట్టిన
తహతానియా, వస్తానియాలు కావు
ఇప్పుడు ఫస్ట్ గ్రేడు కాలేజీలు,
కొండా మాధవరెడ్డి
మన ఫీల్ఖాన రంగారెడ్డి
వకీల్సాబ్ కొడుకు
ఇప్పుడాయ్న హైకోర్టు జజ్
ఈ జషన్ల ఏర్పాటుకు సదరు.
నన్ను రమ్మన్నడు
నా గొడవ చెప్పుకొమ్మన్నడు
విను తాత! విను మా వెత
చేతులార పెట్టుకున్న
'కోస్తా, మెడకోడం కత
పెద్ద మనుషులొప్పందం
తూచ తప్పదనుకున్నం
గైర్ ముల్కి సంబంధం
ఘనత తెస్తదనుకున్నం
జె.వి. నరసింగరావు
మర్రి చెన్నారెడ్డి
బూర్గు రామకృష్ణరావు
సంతకాలు హామీలు



పెట్టని కోటనుకున్నం
తెలంగాణ భాయిలను
అవుతలోరు దోచకుండ
కట్టుదిట్టాలన్నీ
జరిగినాయి అనుకున్నం
అయితాయెగాని తాత
నీ సద్‌సాలా జషన్
బలే మోభా మీదొచ్చింది
తెలంగాణ మనిషివి మరి
బ్రతికితె ఇజ్జత్గ బతికినవు
చస్తె ఇజ్జత్గ చచ్చినవు.
వేలాది తెలంగాన నౌజవాన్ల
నీ వలెనే తయార్ జేసినవు
అందరు నౌజవాన్లతో
తాత అనిపించుకున్నవు
ముల్కీ పోకడ నీది
పల్లెటూళ్ల పొంది
తెలంగాణ పొల్లగాళ్లు
అవారాలై తిరుగుతాంటె
దవాఖానీ కిసాన్లైమిడ్కుతాంటె
నీ గుండె నీరైంది
అసలే భారీ మనిషివి
నీకంటే నీ గుండె భారీది
ముల్కీలకే సర్కారు నౌకరీలని
ఫర్మాను జారీ చేసిండు నవాబు
ఫార్సీలో వున్న దఫ్తర్‌లన్నీ
ఉర్దూలోకి మార్చిండు నవాబు
అప్పుడప్పుడే జామె ఉస్మానియా
నెలకొల్పిండు నవాబు



ముల్కీలకు చదువు రావాలని
ముల్కీలకే నౌకరీలుండాలని
తన రియాసత్ మాములా
అంతా ముల్కీల చేతుల్నె
వుండాలని తహ తహ నవాబుకు
అయన ఇదంతా చేయుటకు
నీవంది ముల్కీల సలహాలు
నువ్వు చూసినవు
ముల్కీ ఫర్మానైతె వచ్చింది
పెద్ద చదువులన్నీ పట్నంలో వున్నై
పల్లెటూళ్ళల్లో ఎట్లా చదవాలె
పెద్దచదువు
వాళ్ళు పట్నం వస్తె యాడుండి
చదువుకుంటరు
పేరుకే రెడ్డి హాస్టలు
దాఖలా మాత్రం అందరికీ
ఎందుకో నీకందరి మీదింత ప్రేమ
వారినంటే ఏమున్నది
తప్పంతా మనదే మరి
ఉర్దూ మన భాషకాదు
కాని అది ముల్కి భాష
భారతాన పుట్టి పెరిగి
అందరి సొత్తైన భాష
దాన్ని కాదని మనమే
లేనిపోని ఇంగ్లీమును
దప్తర్లలో చేర్చినాము

హైద్రాబాద్‌లో రెడ్డి హాస్టలు స్థాపించిన వెంకట్రామరెడ్డి గురించి - 1969/70



దేవుడు

దేవుడు దేవుడు దేవుడు
దేవుడు లేందెవరికి?
ఎవరి దేవుడు వారికి
మనిషి మనిషి కొక్కొక్క మనసు
మనసు మనసు కొక్కొక్క దేవుడు
ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క దేవుడు
ఎప్పుడూ ఏదో ఒక దేవుడు
పిపీలికం నుండి బ్రహ్మ వర్యంతం దేవుడు
అన్ని సుఖాలకూ మూలభూతం దేవుడు
అన్ని దుఃఖాలకు మూలబీజం దేవుడు
బ్రతుకంతా దేవుళ్ళ సంఘర్షణ
మనం చేస్తున్నది దేవుళ్ళకు ఆత్మార్పణ
దేవుడు లేకుంటే ఏ చిక్కూ లేదు
దేవుడు లేకుంటే బ్రతుకే లేదు
ఒకరి దేవుడు మరొకరి దేవుడు తీరిస్తే
ఒకరి దేవుడు తీరడంలో మరొకరి దేవుడు తీరుతే
రక్తి - ముక్తి.



సత్తుపల్లి ఓటర్లూ!

సత్తుపల్లి వోటర్ల
సత్తువెంతో తేలాలి -
గుత్తా జలగం సత్తా
మత్తు వదల గొట్టాలె
సత్తుపల్లి ఎన్నికల్లో
కాళోజీ అభ్యర్థి
గుర్తు సైకిలు గుర్తు
ప్రజాస్వామ్య శక్తులన్నీ
కాళోజీకి మద్దత్తు
అన్యాయాన్నెదిరించుట
కాళోజీ ధర్మసూత్రం
గుత్తా జలగం సత్తా
మత్తు వదలగొట్టాలె
నియంతృత్వ ధోరణుల
నిలువున పాతెయ్యాలె
ప్రజాస్వామ్య శక్తిబలం
ప్రాభవం వెలగాలె
ఏ కాంగ్రెసు అయితేనేమి
ఎమర్జెన్సీ కాంగ్రెస్
అధికారం ఉన్నప్పుడు
అన్యాయం చేసింది
అభయ మిప్పుడంటున్నది
అదిమి అదిమి పెట్టిందే
భ్రమలు పెట్టి మోసపుచ్చి
వోట్లు పొంది గెలిచిందే
పాలన పేరిట ప్రజలను
భరతం పట్టించిందే



కాంగ్రెసు ముసుగుల మనిషి
జలగం వెంగళ్రావు
అధికారం వున్నప్పుడు
ఇందిరమ్మ బంట్రోతు
అధికారం లేనమ్మకు
ఎదురు తిరిగి ప్రేలుతాండు
పెత్తనదారీ పెచ్చెను
చిత్తుగా వోడించాలి
సత్తుపల్లి ఎన్నికల్లో
కాళోజి అభ్యర్థి
గుర్తు సైకిలు గుర్తు
ప్రజాస్వామ్య శక్తులన్నీ
కాళోజీకి మద్దత్తు
అన్యాయాన్నెదిరించుట
కాళోజీకి వున్న సొత్తు
సత్తుపల్లి వోటర్ల
సత్తువెంతో తేలాలి
గుత్తా జలగం సత్తా
మత్తు వదలగొట్టాలి.

1978లో సత్తుపల్లి నియోజకవర్గం నుండి, జలగం వెంగళ్రావుతో ప్రత్యర్థిగా పోటీ చేసినపుడు రాసిన గేయం.



అన్యాయం అంతరించాలె

ఈనాడే కాదు
ఏ నాడైనా నేను
పాల్పడ్డది సెడీషన్ కే!
పాలనాధికారం దుర్వినియోగం చేసే
గుండాలకు నేను ద్రోహినే
దొంగనాకొడుకు పరిభాషలో
'ద్రోహం' అంటే
అన్యాయాన్నెదిరించడం
అన్యాయాన్నెదిరించడం
నా జన్మహక్కు - నా విధి
ఆర్డినెన్సుల ద్వారా
నీవే చేసే నిర్వచనాలు
నీవి - నీ అస్తిత్వం కాపాడుకునేవి
కాగితాల గుర్రాల దెక్కలు
నీ ప్రభుత్వాదేశాలు
నీ రంకురాట్నం ఎక్కి
గిరగిరకు మురిసిపొయ్యే
నల్లబజారు సామంతులు
రాష్ట్రాల 'కొజ్జా' 'సవార్లు'
యంత్రాంగం ఉట్లకు వేలాడే
అధికార నిషా తలకెక్కిన
నిశాచర గబ్బిలాలు
ధైర్యంగల చిన్నపాటి
సూర్యకిరణం వంటి
స్వాతంత్ర్య సమరవీరులు
అయిదుగురున్న చాలు.



మీ కౌరవుల మదపు
తొడలు విరుగగొట్టడానికి.
మీ శకుని పాచికల బండారం
బైటపెట్టి, తలతిక్కను
చిత్రిక పట్టడానికి –
'రమీజా', 'షకీలా'ల
అవమానక్షతికి ప్రతీకారం చేయడానికి
సామాన్యుడా మేలుకో
ఈ కొజ్జా ప్రభుత్వం
దొంగలకు బంటు
చీకటి బజారు ఏజెంటు
పోలీసు దౌర్జన్యాన్ని
శాంతిభద్రతలని చాటింపుచేసే
దప్పుకొట్టే వెట్టి తొత్తు –
అవక తవకల్లో
పంచప్రాణాలు గల రాక్షసి
యీ దోపిడీ పాలనా వ్యవస్థ
దానికి పరికరంగా బతుకు
మేధావి వర్గం మోసాలను గుర్తించు
'వీరనారి మన ఇందిర' అని
పాడినవాని నిలదీసి అడుగు
ఆ పాటకర్థమేమిటో,
ఇందిర చెన్నన్నల చేతికింది
గంజి గతుకు
చతురమతుల చేతుల్లో
కీలుబొమ్మవై ఆడకు
మనిషిగ బతుకు



గణపతి ఉత్సవాలలో చూపిన ఉత్సాహం
దినం జరిగే అన్యాయాన్నెదిరించడానికి
వాడుకునే చిత్తవృత్తి అలవర్చుకో
Do or Die అని అన్నారు గాంధి 1942లోనే
1980లో కాళోజీ మాట -
Kill the exploitor and
live life without exploiting others
That is freedom
అన్యాయాన్నెదిరిస్తే
నా గొడవకు సంతృప్తి
అన్యాయం అంతరిస్తే
నా గొడవకు ముక్తిప్రాప్తి
అన్యాయాన్నెదిరించినోడు
నాకు ఆరాధ్యుడు

తొలి తరం స్వాతంత్ర్య సమరయోధుల ఉపేక్షా భావాన్ని దృష్టిలో ఉంచుకొని



నడత నాణ్యం

దొంగవలె అందాల తొంగిచూచుట తప్పు
అగుపడిన అందాన్ని అరయకుండుట తప్పు
కనపడ్డ ప్రతిదాని కాసపడుటయు తప్పు
భంగపడి వాంఛలకు లొంగిపోవుట తప్పు
కినుకతో మదిలోన క్రుంగిపోవుట తప్పు
పైకి ప్రహ్లాదువలె పలుకుచుండుట తప్పు
సహజ ప్రవృత్తులను చంపివేయుట తప్పు
సహజమని వృత్తుల చంకచేరుట తప్పు

లోకనాయక్

పుటుక నీది
చావు నీది
బ్రతుకుంతా దేశానిది

లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ మరణించిన సందర్భంగా



ఎవరనుకొన్నారు?
ఇట్లౌనని ఎవరనుకొన్నారు?

ఎవరనుకున్నారు ఇట్లౌనని ఎవరనుకున్నారు

ఆంధ్ర తెలంగాణలకు అన్యత ఏర్పడుతుందని
హామీలిచ్చినవారే అంత స్వాహా చేస్తారని ॥ ఎవర ॥

అన్నలు ఒప్పందానికి సున్నా చుట్టేస్తారని
పరిపాలనతో తమ్ముల 'ఫజీతల'పాలు చేస్తారని ॥ ఎవర ॥

ముఖ్యమంత్రియే స్వయముగ సఖ్యత ఛేదిస్తాడని
ప్రాంతీయాధ్యక్షుండు ప్రక్క తాళమేస్తాడని ॥ ఎవర ॥

'కావలి కుక్కలు' దొంగల గంజికాసపడతాయని
కావలివాడే దొంగల కావళ్ళను మోస్తాడని ॥ ఎవర ॥

సిబ్బందిలోగల తమ్ముల ఇబ్బంది పెడతారని
అన్నలమను మాట మరచి అహంకార పడతారని ॥ ఎవర ॥

తమ్ముని తల బోడిచేసి దక్షత అనుకుంటారని
తంతే – తమ్ముడు అన్నను తన్నిండని అంటారని ॥ ఎవర ॥

తప్పుడు లెక్కతొ తమ్ముల నెప్పుడు ఒప్పిస్తారని
అంకెల గారడి చేస్తూ చంకలు ఎగిరేస్తారని ॥ ఎవర ॥

పోచంపాడు, శకుని పాచిక పాలౌతుందని
తెలంగాణవాసులకు త్రిశంకుస్థాయి వస్తుందని ॥ ఎవర ॥



ప్రాంతాన్ని పాడుచేసి శాంతి శాంతి అంటారని
కడుపుల్లో చిచ్చుపెట్టి కళ్ళు తుడువ వస్తారని ॥ ఎవర ॥

అధికార ప్రకటనలో అబద్ధాలె ఉంటాయని
బాధ్యతగల మంత్రికూడ బాతాలే కొడతాడని ॥ ఎవర ॥

మంత్రి అయిన మురిపెముతో మనిషి దయ్యమౌతాడని
ప్రజాస్వామ్య విధానాన్ని బదనాము చేస్తాడని ॥ ఎవర ॥

ఓట్లు పొంది సీటు దొరక నోట్ల మన్ను పోస్తాడని
నమ్మకద్రోహం చేస్తూ గమ్మున కూర్చుంటాడని ॥ ఎవర ॥

ప్రజాస్వామ్యమీ తీరుగ పాడుచేయబడుతుందని
శాసనసభ వుండికూడ మోసమె సాగిస్తారని ॥ ఎవర ॥

విశాలాంధ్రులను సైతము విషాదులు చేస్తారని
తెలంగాణ వేర్పాటుకు తీరులు కల్పిస్తారని ॥ ఎవర ॥

తీరవాసులైనంతనె తీర్థంకరులౌతారని
తెలంగాణ వాసులను దేభ్యాలుగ చూస్తారని ॥ ఎవర ॥

అభయమిచ్చి కుత్తుకనే అదిమి అదిమి పడతారని
ఆక్రోశిస్తే శాంతికి అంతరాయమంటారని ॥ ఎవర ॥

తెలంగాణ వేరంటె తెలివి లెక్క పెడతారని
ఆత్మహత్య ధోరణంచు హంగామా చేస్తారని ॥ ఎవర ॥



'ముల్కి మంత్రులందరును ము.మ.[1] భజన చేస్తారని
దొడ్డిదారి పదవులతో దొడ్డవారు అవుతారని ॥ ఎవర ॥

ప్రతినిధులు ప్రజల మరచి పదవిపథము పడతారని
బ్రహ్మానందుని పదమున బ్రహ్మపదము కంటారని ॥ ఎవర ॥

విచ్చలవిడి ఖర్చులతో విలాసాలు చేస్తారని
కేంద్రంపై నిందమోపి కేరింతలు కొడతారని ॥ ఎవర ॥

బార్డరువీరులు ద్రోహుల ఆర్డరు పాటిస్తారని
చేటుగూర్చినోనికి తమ ఓట్లు అందజేస్తారని ॥ ఎవర ॥

చేతకు సిద్ధాంతానికి చీమ ఏన్గ తేడాయని
వట సావిత్రి వ్రతము వారకాంత చేస్తుందని

ఎవరనుకున్నారు ఇట్లౌనని ఎవరనుకున్నారు

---

1. ము.మ. = ముఖ్యమంత్రి



నిర్వాకం

నమ్ముకొని పెత్తనము ఇస్తే
నమ్మకము పోగొట్టుకొంటివి

కుప్పకావలి ఉండి కట్టలు
తప్పదీస్తివి ముద్దెరేస్తివి
సాటివాడు చేరదీస్తే
నోటినిండా మన్ను గొడ్తివి

పదవి అధికారముల బూని
పదిలముగ తల బోడి జేస్తివి
దావునకు రానిస్తె చనువుగ
టోపి పెడితివి లాభపడితివి

అన్నవై తమ్ముళ్ళ తలలను
నున్న జేస్తివి మురియబడితివి
తొత్తులను చుట్టూర జేర్చుక
పెత్తనాలు చేయబడితివి

'పోచంపాడు' పథకము
కూచికూచి చేసేస్తివి
'దొంగ ముల్కి' ననదులిచ్చి
దొరతనమ్ము వెలిగిస్తివి

తమ్ములను ఇన్నాళ్లబట్టి
వమ్ముజేస్తివి తిన్నగుంటివి
ఎన్నిసార్లు మొత్తుకున్నను
అన్నవయ్యును గమ్మునుంటివి

అన్న అధికారమునకు తగిన
న్యాయబుద్ధిని కోలుపోతివి
చిలిపి చేష్టలు చేసి ఇప్పుడు
చిలుక పలుకలు పలుకుచుంటివి

65, 470



తెలంగాణ వేరైతే

తెలంగాణ వేరైతే
దేశానికి ఆపత్తా?
తెలంగాణ వేరైతే
తెలుగుబాస మరుస్తారా?
తెలంగాణ వేరైతే
కిలోగ్రాము మారుతుందా?
తెలంగాణ వేరైతే
తెలివి తగ్గిపోతుందా?
తెలంగాణ వేరైతే
చెలిమి తుట్టి పడుతుందా?
వానపడక వుంటుందా?
చెలిమ లెండిపోతాయా?
కులము తగ్గిపోతుందా
బలము సన్నగిలుతుందా?
పండించిన వరికర్రల
గింజ రాలనంటుందా?
రూపాయికి పైసాలు
నూరు కాకపోతాయా?
కోర్టు అమలు అధికారము
ఐ.పి.సి. మారుతుందా?
పాకాల, లఖ్నవరం
పారుదలలు ఆగుతాయా?
గండిపేటకేమైనా
గండితూటు పడుతుందా?
ప్రాజెక్టులు కట్టుకున్నా
నీరు ఆగనంటుందా?
పోచంపాడు వెలసి కూడ
పొలము లెండిపోతాయా?
తెలంగాణ వేరైతే
దేశానికి ఆపత్తా?



నలుబదైదు సంతకాల నటుడా?

నా నోటికాడి బుక్కను
నాణ్యంగా కాజేసిన
నాగరికుడా 'విను'

నా నాగటి చాలులోన
నాజూకుగ పవ్వళించి
నను కాటేసిన
నాగరికుడా వినుు?

నావారల చేరదీసి
నానా విధ బోధలతో
నాణ్యంగా నన్ను కొరిగి
నలుబదైదు సంతకాల
నాటకమాడిన నటుడా
నాగరికుడా వినుు!

కోటిన్నర మేటి ప్రజల
గొంతొక్కటి గొడవొక్కటి
తెలంగాణ వెలిసి నిలిచి
ఫలించాలె భారతాన
భారత మాతాకీ జై
తెలంగాణ జిందాబాద్



రావి నారాయణరెడ్డి

వీర తెలంగాణ సమర
వీరాగ్రేసర? రావి? ఆంధ్ర
మహాసభల మేటిప్రజల
మనిషి ప్రాణ సఖుడ?
నారాయణ! నారాయణ!

తీరా యీనాడు నీవు
ఏమిటి మాట్లాడునది?
ఏ 'ఘరాన' పాట ఇది?
'ఆంధ్రమహాసభ'ను రెండు
ఆంధ్ర మహాసభల జేసి
'తెలంగాణ' తెలుగన్నల
తెలివి, బలము పెంచె నెవడు?

'చీలికలే' అభివృద్ధికి
తేలికైన మార్గాలని
'చీలికలే' అభివృద్ధికి
మూలికన్న వేది ఎవడు?

వందలేండ్లు తెలంగాణ
మంది వేరుగున్నప్పుడు
తెలంగాణ తెన్గుతనము
దినుసు గుణము పోయిందా?

కృష్ణ దేవరాయలెవరొ?
కృష్ణమూర్తి శాస్త్రి ఎవరొ?

తెలియకనే వున్నారా?
తెలంగాణ కితాబీలు

నన్నయ్య తిక్కన
నారాయణభట్టు లెవరొ?
ఆ.ప్ర. రాజ్యము వెలయగ
అందినదా 'కబురు' మనకు

సినీ పాట గమ్మత్తుల
'సినారె' మన తమ్ముడు
'వీర తెలంగాణ నాది
వేరు తెలంగాణ కాదు'
అన్న మాటలను
అన్నా! నీ వంటవ? నీ వంటవ?
రెండున్నర జిల్లాలదె
దండిబాస అని అంటవ?
తక్కినోళ్ళ నోళ్ల యాస
త్రాక్కి పెట్టవలెనంటవ?

'బాలానందము' కోస్తా
బాలల ఆనందానికా?
'సిల్సిలాగ' పెట్టిన్నని
సిబ్బందిలొ ఒకడంటె
ఆంధ్రోళ్లన్నది వింటె
అగ్గె పోదువు నీవును
ఇక్కడంత తుర్కమ్మని
ఇంగ్లీషులో అఘోరించు

ఆంగ్లాంధ్రుల? సమ
గ్రాంధ్ర సభ్యత సంరక్షకులు

తెలంగాణ ప్రాంతమందు
'తెలుగుతనము' మృగ్యంబని
తెలంగాణ రిక్షన్నలు
తెలియక ఆంధ్రమ్మ తోడ
'చారానా' 'ఛెయ్యాన'ల
'ఫేరు రేటు' అంటూన్రని
అ.ప్ర. రాజ్యావతరణ
ఆనందోత్సవ మందున
నాట్య సంఘాయోజిత
నట కవి గాయక సభల
నిరుడు అయిదు నెల్లకింద
నిండిన 'రవీంద్ర భారతి'
నిండవున్న ఆంధ్రన్నల
కుండ పగిలినట్లు నవ్వ
తెలంగాణ వీరులంత
తలలు వంచుకొని ఏడ్వగ
అన్నది నీ వెరుగుదువా

'అందమైన' వచనకవికి
తెలంగాణ 'బాలామణి'
తొలి జవ్వన వయ్యారము
'చుడీదార్ పాజామా'
తొడిగి నడిచి పోతోందట
అబిదు సర్కల్ పొంట
అనాడే ఆ సభనే

ఆంధ్ర మహాకవి ఒకడు
అహంకారమున పలికె
ఆంధ్రన్నలు ఇగిలింపగ
అవమానముచేత మండి
తెలంగాణము కోపింపగ
తెలిసిందా రావన్న

బాస పేరు 'సాలెగూడు'
భద్రమనకు రావన్న!

పన్నెండేడుల ఆంధ్రుల
ప్రగల్భాలు ప్రలాపాలు
తెలంగాణను ఆంధ్రను
కలిపిన కుట్లల్ని త్రెంపి
మనుషులను మనసులను
తనకలు జేసేసినాయి
అతకదింక 'కుండ' పగిలె
అతకదింక రావన్నా

తెలంగాణ వేరైతె
వీర తెలంగాణాని
కొదవేమిటి వంకేమిటి
నీమదిగల శంకేమిటి?
పెత్తన్‌దారుల నెదుర
సత్తువ లోపిస్తుందా?
ముఠాకోర్ల పట్టి తన్ను
'ముల్కి' శక్తి నశిస్తుందా?

తెలంగాణ కామరేడ్లు
బలము కోలుపోతారా?
సీమల గీతలు మారితె
చీమల గతి మారుతుందా?

కుండలు వేరైనంతనె
తిండి సరుకు మారుతుందా?
తొమ్మిది జిల్లాలల్లో
తెనుగుతనము పోతుందా?

తొమ్మిది జిల్లాలల్లో
'కొడవ'లాడ నంటుందా?
తొమ్మిది జిల్లాలల్లో
'సుత్తె' మొట్టనంటుందా?

తొమ్మిది జిల్లాలల్లో
'రక్తవర్ణ'మే మారునా?
తొమ్మిది జిల్లాలల్లో
'మార్క్స్' మార్కు మారుద్దా?

తొమ్మిది జిల్లాలల్లో
బాస మాసిపోతుందా?
తొమ్మిది జిల్లాలల్లో
పనిపాటలు వేరౌతాయ?

తెలంగాణ వేరైతే
కామరేడ్ల కేమైతది?

తెలంగాణ వేరైతే
కూలి నాలికేమైతది?

తెలంగాణ వేరైతే
కర్రుదుంప కేమైతది?
ఆ.ప్ర. రాజ్యము పేరట
జరిగిన అన్యాయాలకు
జ్ఞాపకాల చిహ్నంగా
ఆ.ప్ర. నిలచి వుండాలా?

తెలంగాణ వేరైతే
తీరిపోవు ప్రశ్నలన్ని
మోసగాళ్ల పొత్తు పోతె
నీ కెందుకింత దిగులు?

తెలంగాణమున కూడా
దొంగలుంటె వార్ని మళ్లీ
ఎదిరించి బుద్ధిచెప్పు
వీరులు తెలంగాణ ప్రజలు
ఆంధ్ర బూర్జువాల
హోమి ఆసరాలు కోలు

పోయి కోరలు దీసిన
పాముల కోరలు మళ్లీ
వస్తే, కోరలూడదీయ
వెనుకాడెదరా మన వీరులు?

వీర తెలంగాణ ప్రజలు
వీర తెలంగాణ సమర
వీరాగ్రేసర రావి: ఆంధ్ర
మహాసభల మేటి "ప్రజల
మనిషి" ప్రాణసఖుడ

నారాయణ నారాయణ
తీరా యీనాడు నీవు
ఏమిటి మాట్లాడునది?
ఏ ఘరాన పాట యిదీ?

---

1. నిల్సిలా = వరుసగా

2. 1.11.69లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సందర్భంగా 'వీర తెలంగాణనాది – వేరు తెలంగాణ కాదు' అని సి.నా.రె. రాసిన గేయాన్ని ఉటంకించి రావి నారాయణ రెడ్డిగారు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాల్లో చేసిన ప్రసంగానికి స్పందించి రాసింది.

2. తెలంగాణ భాషను, యాసను అపహాస్యం చేసినవారి పట్ల నిరసన తెలుపుతూ.



ప్రాంతం వాడే దోపిడి చేస్తే

దోపిడి చేసే ప్రాంతేతరులను
దూరం దాకా తన్ని తరుముతం
ప్రాంతం వాడే దోపిడి చేస్తే
ప్రాణంతోనే పాతర వేస్తం
దోస్తుగ ఉండే వారితొ మేమును
దోస్తే చేస్తం – ప్రాణమిస్తం
ఎంతకు అంత అన్న ధోరణితో
చింతమాని బ్రతుకును సాగిస్తం
తెలంగాణమిది – తెలంగాణమిది
తీరానికి దూరాన వున్నది
ముంచే యత్నం చేస్తే తీరం
మునుగును తానే – మునుగును తప్పక

ప్రత్యేక తెలంగాణా ఉద్యమం సందర్భంగా 1-5-1969న వరంగల్లులో జరిగిన ప్రజానమితి సదస్సులో చదివినది.



పోదాం పదరా!!

పదరా పదరా పోదాం పదరా
తెలంగాణ సాధిద్దాం పదరా
దొంగల దూరం కొడదాం పదరా
వేరే రాజ్యం చేద్దాం పదరా ॥ పదరా॥

షాట్లకు బెదరక చెదరక పదరా
హిరణ్యకశిపుడు హడలగ పదరా
నర్సింహుడవై ముందుకు పదరా
పదరా పదరా ... ॥ పదరా॥

అధికృత హింసనే పాలన అంటే
ప్రహ్లాదుని హేళన చేస్తుంటే
ప్రత్యక్షంగా నర్సింహులమై
ప్రతిహింసకు పాల్పడదాం ॥ పదరా॥

హిరణ్యకశిపుల పొట్టలు చీల్చి
పేగుల మాలలు చేద్దాం పదరా
పదరా పదరా....
వేర్పడదామని ఇద్దరికుంటే
కాదను వారిని కాలదన్నమా
వేరే రాజ్యం చేయబూనమా
పదరా పదరా.....

జై తెలంగాణ పత్రికలో ప్రచురితం



వీర తెలంగాణ నాది

వీర తెలంగాణ నాది వేరు తెలంగాణ నాది
వేరై కూడ తెలంగాణ వీరతెలంగాణ ముమ్మాటికి
తెలంగాణ వేరై నిలచి భారతాన వెలయు ముమ్మాటికి
వీర తెలంగాణము వైనంతో భారత పౌరుని ధీధైర్యంతో
ప్రజావాణి నా గొడవ మిన్న 'ప్రజా' ప్రకటన జేస్తున్నది
వీర తెలంగాణ నాది వేరు తెలంగాణ నాది
వేరై కూడ తెలంగాణ వీర తెలంగాణ ముమ్మాటికి
తెలంగాణ వేరై నిలిచి భారతాన వెలయు ముమ్మాటికి
దోపిడి జేసే ప్రాంతేతరులను
దూరము దాక తన్ని తీరుతం
ప్రాంతం వాడే దోపిడీ జేస్తే
ప్రాణం తోనే పాతర వేస్తం
దోస్తుగ వుండే వారితో మేమును
దోస్తే చేస్తం ప్రాణం ఇస్తం.
'ఎంతకు అంత' అన్న నీతితో.
చింత మాని బ్రతుకును సాగిస్తం .
తెలంగాణ 'బాషిందా' బ్రతుకు
తెలిపిన తరతరాల సత్యమిది
కన్నడులు మహారాష్ట్రులు తుర్కీ
అన్నయ్యల తరతరాలేరినది
గుజరాతీ, మార్వాడి పారిసీ
గుజ్జన గూళ్లు అనుభవించినది
కాబూలీ ఈరాని భాయిలకు
కనువిప్పుగ మెలిగిన విధమిది
తెలంగాణమిది తెలంగాణమిది
తీరానికి దూరాన ఉన్నది
ముంచే యత్నము చేస్తే తీరము
మునుగును తానే తీరము తప్పక
జైహింద్ జై తెలంగాణ తెలంగాణ జిందాబాద్
భారతమాతాకీ జై తెలంగాణ జిందాబాద్.



తెలుగుబాస ఎన్నితీర్లు

తెలుగుబాస ఎన్నితీర్లు
తెలుగు యాస ఎన్ని తీర్లు
వాడుకలున్నన్ని తీర్లు
'వాడుక' ఏ తీరుగున్న
తెలుగు బాస వాడుకయే
అన్ని తీర్ల వాడుకకు
పరపతి పెత్తనమొకటే
ముఖే ముఖే సరస్వతి
నోట నోట మాటమ్మ
అన్ని తీర్ల వాడుకను
ఒకే తీరుగా చూచుట
ఎవరి వాడ వారిది అని
ఎవరి వేడ్క వారిది అని
ఎవరిదైన వాడుకె అని
అందరికి వేడుకగ తలుస్తే
తెలుగు బాస అభివృద్ధి
ఒకే బాస మాటాడే
తెలుగు వారిలో సమైక్యత
లేకుంటే తన్నులాట
తప్పదు ఏనాటికైన
రెండున్నర జిల్లాల
రెండుమూడు తెగలోండ్లకు
'బడిపలుకుల' బాబులకు
పంజరాల చిలుకలకు
ఎప్పుడు తెలుస్తుందట
ఎన్నడు తెలిసొస్తుందట
వాడుక భాషంటే ఏందో?

ఎవరి వాడకం భాషో?
గ్రాంధికాన్ని వద్దంటూ
రెండున్నర జిల్లాల
చదువుకున్న తెగలోళ్ళ
వాడుకనే గొప్పజేసి
దానికె పట్టం గట్టి
'గురజాడ' 'గిడుగు' పేర
మసిబూసి ముండమోపి
రెండున్నర జిల్లాలదె
దండిభాష అంటు చాటి
తక్కినోళ్ల నోళ్లు యాస
తొక్కి నొక్కి పెట్టి వుంచి
రెండున్నర జిల్లాల
చదువుకున్న కుటుంబాల
రెండుమూడు తెగలోళ్లదె
'ప్రామాణిక భాష' అని
శిష్టుల వ్యావహారికమని
అందరి తలపై రుద్దితే
ఎక్కడి న్యాయం అంట
ఇంతకన్న అందరికి
ఒకే తీరు ఇబ్బంది (కలిగించి)
ఒకే తీరు సాధన కలిగించే గ్రాంధికము
సాధ్యమైన గ్రాంధికము
నయమనిపిస్తది అన్న
'వాడుక బాస' అంటె
రాయవచ్చినోడు రాసే
దస్తూరి వలె కాదా?
దస్తూరిలో లిపి వలెనే
మాటల్లో యాసకాదా?
దస్తూరిలో అక్షరాల
రూపువలెనె
మాటల ఉచ్చారణ అవును కాదా?
ఎవని యాసలో వాడు
మాట్లాడుతున్నట్లే
ఎవని మాండలికము వాడు
వాడుకొనుచున్నట్లే
ఆ యాసతో, ఆ విరుపుతో
ఆ యమకం గమకంతో
రాస్తె, తప్పేమిటంట?
అన్ని వాడుకలు కూడా
ప్రామాణిక స్థాయి తోడ
వెలుస్తుంటె తప్పేమిటి?
కాళిపట్నం రామారావు బాస బాస కాదా?
రాచకొండ విశాస్త్రి యాసరాత బాసకాదా?
1. "దయ్యాల పన్గడది' మెదక్ పలుకు బాసకాద?
2. 'అంగుడుపొద్దులో' వున్నది కరినగరం బాస కాద?
3. సోమరాజు 'పొద్దు'లున్న బాసకు పట్టం వద్దా?
4. 'కొడుకుపుట్టాలె' బెస్తపల్లె బాస బాస కాదా?
రాయలసీమ వాడి బాస ఇపుడు యాడున్నది?
'శ్రీకాకుళ' గిరిజనుల తెనుగు తేనెలెచటున్నవి?
'బొబ్బిలి దిబ్బల' పులుల గాండ్రింపులు వినరావేం
అందరిచే 'చిత్తం' సార్ అనిపించే చిత్తవృత్తి రెండున్నర
జిల్లాల 'బుల్లోరి'కి ఎందుకంట?
'ముద్దాయి' అన్నమాట
ముద్దయి 'ని' మధ్యక్షర దీర్ఘంతో
గుంజిలాగి పల్కితేనే

ప్లేంటిఫ్ అక్యూజుడైతడ
'ముల్టిం' అక్యూజుడు అనుకోండని
అధికార రాజకీయ దుర్మదాంధం
ఏ ప్రాంతం సౌలభ్యం కోసరమని
యేమనవలె ఏటింకా దౌర్జన్యం
ముద్దాయి అని అంటే
దావా చేసిన వాడు
దావంటె ప్లేంటుకాద?
దావా చేసినవాడు
ముద్దాయి అవునాకాద?
'అక్యూజుడు' అనుమాటకు
'ముద్దాయి' తెలుగుజేసి
'ముల్టిం' మాటకు మారుగ
వరంగల్లు అదాలత్‌లో
బోర్డుపెట్టి ముద్దాయంటే
నీబాంచెను గులాపోజ్జి
అన్నోనికి, చిత్తంసార్, చిత్తంసార్
అన్నోనికి, ఫరఖేమిటి, భేదమేంది?
'రోడ్డంటే' తప్పుకాని వేత్తలంత
'సడకంటె' చెవులు మూసుకొనుటెందుకు
'టీ' హోయిగ చప్పరిస్తు –
'చా' అంటే 'ఛా ఛా' అని
'మొగ' మేదో తాగినట్లు
బ్రేలాడించడమెందుకు?
'క్లోర్టుని' 'హైకోర్టుని' గౌరవంగ
పలుకన్నలు,
'అదాలత్' అని అంటెను
న్యాయస్థానము వారికి
అవమానం జరిగనట్లు
ఉలికి ఉలికి పడుటెందుకు?
'మా అమ్మ వచ్చింద'ని అనుకుంటూనె
'మా నాయిన వచ్చిండ'ని అన్నందుకె
చెవులు మూసుకొనుటెందుకు?
'మందలించు'టని అంటే
తమ వాడుక బట్టి దాన్ని
'చీవాట్లని' అర్థించుక
'పరామర్శ' 'పలకరింపు'
అను అర్థంలో వాడుక
తెలంగాణ ప్రాంతంలో
ఉన్నదన్న 'తెలివిడి' కూడా లేక
కయ్యానికి కాలుదువ్వ 'సహృదయం'
నేమనవలె?
పోయిందంటే చచ్చిపోయిందని
అనుకొనుట ఎందులకని
నక్కల గుట్టలో వున్న
'లాండ్‌మార్టగేజు' బ్యాంకు
'అరాజీ రహన్ బాంకు' బోర్డేమంటది
'భూమి తనఖా బాంకట' దాని పేరు
'తనఖా' అంటే జీతం
పారసీ పదం అది
సర్కారు పరిభాషలో
నిజామంత వందలేళ్ళు
వాడుకకెక్కిన పదమది
కోటిన్నర తెలుగోళ్లకు
'తనఖా' అంటే జీతం
వారిని తనఖా అంటే 'రహన'ని

(మార్టగేజని)
అర్థం చేసుక చావండని
ఈ తీరుగ లొంగదీస్తె
అడిగే వాడే లేడా?
దర్జాయన, మేరాయన
అంటేనే ఏవగింపు ఎందులకని?
'టైలరు' ఎక్కడి తెనుగు?
'సేగెదారు' తెలుగుకాదు.
'క్లరకు' అంటే తెలుగా?
N.G.O., L.D.C., U.D.C. అంటే తెలుగా?
బి.డి.యో, చేరుమను, H.M., P.M., C.M.
అన్నమాటలే తెలుగా?
హైద్రాబాద్ దుకాణం పేర్ల బోర్డులన్ని
ఇంగ్లీషులో వున్నాయని
ఏడ్సిండట ఒక ప్రతినిధి
తెలుగు మహా సభల.
దుకాణం దుకాణమంటే
ఎందుకన్న అదరిపాటు
'కొట్టు' షాపంటే మెప్పు
కులుకు పాటు ఎందులకని?
'సిల్‌సిలాగా పెట్టి'న్నని
సేగెదారు అంటేనె
'సీరియల్'ను యీ 'వెధవ'లు
'సిల్‌సిలా' అంటూన్రని
వెక్కిరించు రెండున్నర జిల్లాల
చిలుక పలుకు అధికార్లను
తెనుగు భాష మాట్లాడే
భావ సమైక్యతకై కృషి చేసే
నన్నయ్యని కొలవాల్నా?
పళ్లు విరగ తన్నాల్నా?
ఆ.ప్ర. రాజ్య సమైక్యత
చెదరిపొయ్యే దుర్ఘటన ఏర్పడెనట
ఆ.ప్ర. రాజ్యానికెంతో
ప్రాణాంతకమై పోయిందట.
గండం తప్పిందట
అందుకె రాష్ట్ర సమైక్యతను
నిలిపుంచే ఘనసంకల్పంబట?
ప్ర. తెలుగు మహాసభలట
ప్ర. తెలంగాణ ప్రదేశం
రాజ్య మొకటి ఏర్పడితే
భారత జాతి సమైక్యత
కేమిటి అపకార మంట?
రాజ్యాల విభజనము
గ్రామ స్వరాజ్యం మేరకు
అవునా కాదా?
తెలంగాణ ప్రదేశమంత
వేరే రాజ్యంగా వుంటే
భారత రాజ్యాంగానికి ముప్పొస్తద?
ఆ కోరిక వుండటమే. దేశద్రోహమా?
తెలుగు భాషతో వైరమా?
ఇవి యన్ని దొంగమాటలేన కాదా?
ప్ర. తెలుగు మహాసభల ముసుగేసుక
'తెలంగాణ' ఏర్పాటు
ఆ.ప్ర. రాజ్యవిభజన
కోరికయే ద్రోహమ్మని
చాటించే అధికారం

ఆ.ప్ర.రా. ముఖ్యమంత్రి
జలగం వెంగళరావుకు ఎవడిచ్చెను?
ఇది అధికార దుర్వినియోగం బొనకాదా?
రాజ్యం విభజన కోరెడి వారందరు
భారత పౌరులు అవునా కాదా?
'తెలుగుదేశ' మను మాటకు
'తెలుగుజాతి' అను మాట కర్థమో
మనందరిది భారతజాతే జాతని
భారత దేశ మొక్కటే
మన అందరి దేశమ్మని
భారతదేశం లోన
హిందీ భాషీయులంత
ఒకరాజ్యంలో లేరని
భారతీయులే వారని
తెలుగుబాస మాట్లాడే
వారు కూడా రెండు మూడు
రాజ్యాలుగా విడిపోతే
భారతదేశ సమైక్యత
భావం ఇసుమంతైనా కుంటుబడదు
అను సంగతి
తెలుగుజాతి
తెలుగుదేశంలోని వారికి
నచ్చజెప్పు విధమేది?
తెలిసికూడ
రెండున్నర జిల్లోళ్లు
రెండు మూడు తెగలోళ్లు
చదువుకున్న కులపోళ్లు
రెండున్నర జిల్లాలదే
దండిబాస అని అంటే
అధికార మంత గూడ
తామే పంచుక తింటే
తక్కినోళ్ల నోళ్ల యాస
తొక్కిపెట్టి నొక్కేస్తే
తిరగబడాల్న వద్దా?
తెలుపండి నలిగెటోళ్లు
హైద్రాబాదు తెలుగుపట్ను మోలె
లేదంటె అది తెలుగుజాతికె సిగ్గట
ఆ మహానుభావునకు తెలియదింక
హైద్రాబాదే కాదు ఆ మాటకొస్తె
తెలంగాణ మరాట్వాడ
కర్ణాటక జిల్లాలతో వెలసినట్టి
ప్రదేశమంత వివిధ భాషలకూడలి
వివిధ సంస్కృతులకు కూడలి
మీనియేచర్ ఇండియా
హైద్రాబాదను నగరం
నేటికి భారతమను మన దేశం
రూపానికి చిహ్నము, ప్రతీక
జైహింద్ జై తెలంగాణ.

---

1. 'దెయ్యాల పన్నడ' వెల్దుర్తి మాణిక్యరావుగారి మెదక్ మాండలికంలోని నాటకం.
2. 'అంగుడు పొద్దు' - నురమొళి - సిరిసిల్లా మాండలికం
3. 'పొద్దు' - రంధి సోమరాజు - విశాఖ మాండలికం
4. 'కొడుకుపుట్టాల' - గణేశ్‌పాత్రో నాటకం - విశాఖ మాండలికం.



ప్రత్యేక తెలంగాణ అంటే

ప్రత్యేక తెలంగాణ అంటే
పక్కలిరగ తన్నేందుకు
ఆ.ప్ర.రా. ప్రభుత్వాన్ని
అధికారము ఎక్కడిది?

ప్రజాస్వామ్య రాజ్యాంగం
పరిపాలన గల దేశము
ప్రజా మతము ప్రకటిస్తె
పట్టి కొట్టి చంపేస్తద?

వేలు లక్షలు ప్రజలు
జేలుకేగ సిద్ధపడితే
ఏర్పాట్లు చేయలేక
లాఠీచార్జి పరిపాలన?

కాడెద్దుల ధోరణిలో
కూడని పనియే లేదా?

విసిగి వేసారి జనం
హింసకాండ తలబెడితే
కేంద్రానిది బాధ్యతంత
'ప్రెస్టేజి' పేర హింస
ప్రభుత్వాన్ని సబబైతె
ప్రాణిధర్మ హింసకాండ
ప్రజలకు కూడా సబబే.



బ్రహ్మన్న చంపు చంపు
ఏ పాటి చంపుతావో
తూటాలు ఎన్నున్నయో
పేల్చుకో, ఆబాలం గోపాల
చంపు చంపు చంపు అనుఃబరి రొమ్ములతో బజార్లో
తూటాలను ఎదురుతాన్రు

ఒకటో రెండో వుంచుకో
తుదకు ఆత్మహత్యకైన
అక్కరకొస్తై నీకు, లేకుంటే
ప్రాణాలతో ప్రజల చేతికే
చిక్కితే నీకున్నది కుక్కచావు

తస్మాత్ జాగ్రత్త జాగ్రత్త
భారతమాతాకీ జై
తెలంగాణ జిందాబాద్.



తెలంగాణ బాస

తెలంగాణ 'యాస' నెపుడు
యీసడించు భాషీయుల
'సుహృద్భావన' ఎంతని
వర్ణించుట సిగ్గుచేటు

వాక్యంలో మూడుపాళ్లు
ఇంగ్లీషు వాడుకుంటు
తెలంగాణీయుల మాటలో
ఉర్దూపదం దొర్లగానే
హిహీ అని ఇగిలించెడి
సమగ్రాంధ్ర వాదులను
ఏమనవలెనో తోచదు.
'రోడ్డని' పలికేవారికి
సడకంటె ఏవగింపు
ఆఫీసని అఘోరిస్తూ
కచ్చేరంటే కటువు

సీరియలంటే తెలుగు
సిల్సిల అంటే ఉరుదు
సాల్టు, షుగర్, టిఫిన్ తెనుగు
షర్కర్, నాష్తంటె కొంప మునుగు
టీ అంటే తేట తెనుగు
చా అంటే 'తౌరక్యము'
పోయినడంటే చావు
తోలడమంటే పశువు
దొబ్బుడమంటే బూతు
కడప అంటే ఊరి పేరు



త్రోవంటె తప్పు తప్పు
దోవంటేనే దారి.

బొక్కంటే ఎముక కాదు
బొక్కంటె పొక్క తెలివి
మందలిస్తె తిట్టినట్లు
చీవాట్లు పెట్టినట్లు
పరామర్శ కానేకాదు
బర్రంటె నవ్వులాట
గేదంటేనే పాలు
పెండంటె కొంప మునుగు
పేడంటేనే ఎరువు
రెండున్నర జిల్లాలదె
దండి భాష తెలుగు

తక్కినోళ్ల నోళ్ల యాస
త్రొక్కి నొక్కి పెట్టు తీర్పు
వహ్వారే! సమగ్రాంధ్ర
వాదుల ఔదార్యమ్ము
ఎంత చెప్పినా తీరదు
స్నేహము సౌహార్ద్రమ్ము
భోయి భీమన్న ఒకడు
తెనుగును రక్షించువాడు
భోయి భీమన్న ఒకడు
బెజవాడ గోపాలుని
సభ్యత నెర్గిన ఆంధ్రుడు
భోయీ భీమన్న ఒకడు
పదారణాల ఆంధ్రుడు



తెనుగు సభ్యత సంస్కృతి
ఆపాద మస్తకంబు
నోరు విప్పితే చాలు
తెనుగు తనము గుబాళించు
కట్టుబొట్టు మాట మంతి
నడక ఉనికి ఒకటేమిటి
ఎగుడు దిగుడు ఊపిరిలో
కొట్టొచ్చే తెనుగు తనము
గోపాల కీర్తనమే జీవిక
పాపము అతనికి
ఉర్దంటే మండి పడెడి
పాటి తెనుగు ఆవేశము
జానపదుని లేఖ లేవో
జ్ఞాన రహిత ప్రాయంబున.
వ్రాసినాడు అంతెకాని
తెలివిన పడి, వృద్ధదశలో
కాస్మా పాలిటన్ బ్రతుకును
సాగిస్తూ తెనుగు తనము
శిఖరోహణ అనుకొని
పరిణతి దశ నందు కొనగ
తాపత్రయ పడుచున్నడు
భోయి భీమన్న ఒకడు
తెనుగును రక్షించువాడు
సమైక్యాంధ్రవాది వాడు
భీమశాస్త్రి అని నాతో
పిలుపించు కొన్నవాడు
జానపదుని లేఖావళి
నాటి సఖుడు భీమన్న



చెడిన తెలుగు తనం

నిజాం నవాబు పాలన క్రింద చెడిన తెలుగుతనం
గడచిన పదిహేనేండ్లలో దిద్దబడెను చాలావరకు
ఇపుడు తెలంగాణ అంతట ఆంధ్రత్వం ఎటుచూచిన
'చా', 'టీ' అయి మసలుతాంది, 'సరకు' రోడ్డై సాగుతున్నది
అదాలతు 'కోర్టు'యెను ముల్టీం ముద్దాయాయెను
షక్కర సుగరయి పోయెను ఉప్పు సాల్టుగా మారెను
వచ్చిండని పోయిండని అంటలేదు ఎవడిప్పుడు
వచ్చాడని చచ్చాడని అంటున్నరు చచ్చినట్లు
'పసుపుకుంకుమలు' ఇప్పుడే 'పేరంటా'లవుచున్నవి
ఆంధ్రుల సంస్కృతి సభ్యత తెలంగాణ కబ్జుతాంది
రెండున్నర జిల్లాల యాసంతట వెలుస్తాంది.
తెలంగాణ బంజరంత కృష్ణనిండి పొర్లుతాంది
తెలంగాణ జంగలంత 'గోర' గంతులేస్తాంది
ఎంతలోన తెలంగాణ ఆంధ్రతనం నేర్చుకుంది
భావ సమైక్యత ఎంతలో అందరిని పూనినాది
పెద్దమనిషి ఒప్పందం ఎంతలో ఫలమిచ్చినాది
లాగూ షేర్వానీలు మాని తెలంగాణ వారు
తీరపోని దారి బట్టి వేషాలు వేస్తున్నారు
అందరికీ 'ఆంధ్రత్వం'సోకి ఆడిస్తున్నది
తెలుగువారి రాజ్యం ఇది ప్రాంతం మాటెత్తొద్దు
పెత్తనము రెండున్నర జిల్లాలది మరవొద్దు
భాషా సంస్కృతి యాస రెండున్నర జిల్లాలది
విద్యావిజ్ఞానమంత రెండున్నర జిల్లాలది
కథలు కైతలు అన్ని రెండున్నర జిల్లాలవి
బాలానందం సాంతము రెండున్నర జిల్లాలది
రేడియోలు సినిమాలు రెండున్నర జిల్లాలవి



నైపుణ్యం చాతుర్యం రెండున్నర జిల్లాలది
ప్రతి విషయం తుదిమాట రెండున్నర జిల్లాలది
ఆంధ్రుల సభ్యత సంస్కృతి రెండున్నర జిల్లాలది
ఆటలు పాటలు అన్నీ రెండున్నర జిల్లాలవి
తక్కినోళ్ళు తెలుగుతనం కోల్పోయిన దౌర్భాగ్యులు
ఆంధ్రత్వము వద్దంటు నాన్ తెల్గూస్ అయినట్లు
తెలంగాణపోళ్ళు మరీ పోకిర్లై పోతున్నరు
ఆంధ్రులు అలజడి జేస్తే ప్రజావెల్లువనిపించును.

ప్రత్యేక తెలంగాణ ఉద్యమ సందర్భంగా 1969-70లో రాసిన గేయం




కలం గారడీ కైతల వలలల్లకు


కలం గారడీ కైతల వలలల్లకు
మాట మాటు వైనాల వేటాడకు
గాలాన్ని దాచెడి ఎరగా మారకు
మహాకవివి పూటగడచు మాటాడకు
దోమల సంగీతాన్ని సామ మనకు
దొరతనాల దోపిడిని దోస్తీ అనకు
నరకాసురుని ఏలుబడిని నాక మనక
పరువు కూడ గౌరవమని భావింపకు
ప్రభుత్వాల మోసాలను ప్రతిభ అనకు
తిరగబడిన ప్రజలపైన విరగబడకు
అధికారానికి మంగళహారతనకు
ముఠాబంది విసము దాచు ముసుగు కాకు
చేతనైతే మింగు – చేదు చిందింపకు
భూతాలను చూచి సానుభూతి పడకు
ఏగోలము ఇగిలింతను హేల అనకు
శాంతి భక్షక శాసనాన్ని సౌమ్యమనకు
ప్రజామతము గప్పిపుచ్చ పాటు పడకు
దితి పుత్రుల పాలనను దివ్యమనకు
భస్మాసురు చేతి చలువ రశ్మి అనకు
బాస పేర సాలెగూడు భద్రమనకు
'కీలక' కీలలు వసంతాలు అనకు
చతుర మతుల'కు' బేరాలకు సాయమనకు
వగలమారి పొత్తు మహావరము అనకు
క్రోడెలకు, దూడలకు జోడు అనకు
దాదాగిరి ఆరాధన ధర్మమనకు
దేబెల కనువిప్పగు 'ధీ'ని వాడు



కుటిల మతుల నలుపుబాపు ఛటల గూర్చు
మలి సంజల వెలుగు దివ్వె మలపబోకు
కోరి కోర్కెతీర పడుపు కూడు తినకు
పోరి, పోరి చావు - జడిసి పారిపోకు
పడీ పడక విడిపోయిన చెడుట అనకు
క్రాంతి భ్రాంతి గొల్పు వికారాలు మాను
ధ్యేయమ్మును మరచి పరుల దేహీ అనకు
రవి కాంచని చోటు లరసి రహిని చూడు
మానవతకు రాణించెడి మాట చెప్పు
పాలవెల్లి మునిగి చూడు పాతాళము
నివురు గప్పిన నిప్పుగ నింగి ముట్టు
జానపదుల సాహసాన్ని శంకించకు
అజ్ఞానంతో భయమును అందింపకు
కలం గారడీ కైతల వలలల్లకు
ఉగాది నాడైన కాస్త దగా మాను

1969 కీలక నామ సంవత్సర ఉగాది





నేను - నా గొడవ

నేనంటే నేడు
నా గొడవంటే నాడు
నిజమో కాదోకల రుజువు
నీవూ నేనూ వాడూ
నేనంటె నేటి మనం
నా గొడవ మనస్థితి వైనం
నేనంటే భారత పౌరుడు
నా గొడవ ఆ పౌరుని స్థితి
నేనంటే ఒక వోటరు
నా గొడవ వోటేసేవాడు
నేనంటే తిరుగుబాటు దారు
నా గొడవ మన తిరుగుబాటు